



RNI : APTEL/2023/87662

# సింధూర దర్శిని

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం అవినీతి పై సమరం

WWW.SINDHURADARSINI.COM WWW.EPAPER.SINDHURADARSINI.COM



**విలేకరులు కావలెను**

సింధూరదర్శిని జాతీయ తెలుగు దినపత్రికలో జిల్లాల వారీగా పనిచేయుటకు జిల్లా ఇన్చార్జ్‌లు మరియు మండలాల వారీగా పనిచేయుటకు విలేకరులు కావలెను. ఎలాంటి వేతనం ఇవ్వబడదు. యాడ్స్ పై ఆకర్షణీయమైన కమిషన్ ఇవ్వబడును. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. వివరాల కొరకు బయోడేటాతో క్రింది నంబర్‌ను సంప్రదించండి.

సెల్ నెంబర్ : 7569677170



ప్రచురణ: తిరుపతి సంపుటి:3 సంచిక :292 | సంపాదకులు: కలిచేటి వెంకయ్య | శుక్రవారం 18 సెప్టెంబర్ 2026 | పేజీలు: 8 | వెల:2

Circulated At :Tirupathi, Chittoor, Kadapa, SPSR Nellore, karnool, Prakasam, Hydrabad




# దేశ ప్రయోజనాల కోసం మోదీకి అండగా నిలవాలి

ఎన్డీయే ఐక్యతే దేశానికి బలం - మోదీ నాయకత్వంలో భారత్ అభివృద్ధి అన్ స్టాపబుల్

వికెఎస్ .. ఇదే భారత్ అభివృద్ధి మంత్రం

అయోధ్య రామమందిర నిర్మాణ కలను మోదీ నిజం చేశారు

వామపక్ష తీవ్రవాదాన్ని అంతమొందించారు... ఆపరేషన్ సింధూర్ తో భారత్ సత్తా చాటారు

వారణాసి-వాద్నగర్ సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి

ముఖ్యమంత్రి ప్రసంగానికి రక్షణ మంత్రి ఫిదా... వెరీ వెల్ అంటూ ప్రశంసలు

సీఎం చంద్రబాబు ప్రసంగంతో చప్పట్లతో మార్మోగిన వారణాసిలోని రుద్రాక్ష్ కన్వెన్షన్ సెంటర్

శ్రీ కాశీ విశ్వనాధుని ఆలయంలో కేంద్ర మంత్రులు, యూపీ సీఎంతో కలిసి ముఖ్యమంత్రి ప్రత్యేక పూజలు

**వారణాసి సింధూరదర్శిని:**
"రైట్ టైమ్.. రైట్ లీడర్ నరేంద్ర మోదీ. దేశాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తున్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం కాదు.. దేశ ప్రయోజనాల కోసం ప్రధాని నరేంద్ర మోదీకి అండగా నిలవాలి. ఎన్డీఏ ఐక్యతే దేశానికి బలం" అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల పాలనా ప్రస్థానాన్ని, ఆయన పుట్టిన రోజును పురస్కరించుకుని వారణాసిలో నిర్వహించిన వారణాసి-వాద్నగర్ సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో చంద్ర బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కాశీ-వాద్నగర్ సేవా యాత్రలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం సాధిస్తున్న మిగతా 2లో...






## చైనా నుంచి బయటకు వెళ్లడం ఇక అంత ఈజీ కాదు..

కొత్త రూల్స్‌తో షాక్!

చైనాలో కొత్త నిష్క్రమణ ఆంక్షలు అమల్లోకి

పౌరులు, విదేశీయుల ప్రయాణంపై అధికారులకు విస్తృత అధికారాలు

జాతీయ భద్రత పేరుతో ఆంక్షలు విధించే అవకాశం

నిబంధనలపై హెచ్ఆర్‌డబ్ల్యూ తీవ్ర ఆందోళన

విదేశీయులపైనా గతంలో ఆంక్షలు విధించిన ఉదాహరణలు



చైనా ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త నిబంధనలపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. దేశ పౌరులతో పాటు విదేశీయులు చైనా నుంచి బయటకు వెళ్ల కుండా అడ్డుకునే అధికారం అధి కారులకు ఈ నిబంధనలు కల్పి స్తున్నాయని హ్యూమన్ రైట్స్ వాచ్ (హెచ్ఆర్‌డబ్ల్యూ) తెలి పింది. ఈ నిర్ణయం అంతర్జాతీ యంగా గుర్తించిన దేశాన్ని విడిచి మిగతా 2లో...

## పదే పదే ప్రెస్‌మీట్లు పెట్టి నిరాధార వ్యాఖ్యలు చేస్తున్నారు

జగన్ పై అనిత ఫైర్

డీఎస్సీ నియామకాలపై అసత్య ప్రచారాలు

చేస్తున్నారని అనిత మండిపాటు

డీఎస్సీ పూర్తయిన ఏడాది తర్వాత బురద చల్లుతున్నారని ఆగ్రహం

వాస్తవాలు ఏమిటో ప్రజలకు తెలుసని వ్యాఖ్య



**విజయవాడ సింధూరదర్శిని:**
ఏపీలో డీఎస్సీ నియామకాలపై వైసీపీ చేస్తున్న ఆరోపణలపై రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, టీడీపీ అధికార ప్రతినిధి అప్పసాని రాజేశ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. డీఎస్సీ ప్రక్రియ పూర్తయి ఏడాది గడిచిన తర్వాత, కూటమి ప్రభుత్వంపై బురద చల్లేందుకు వైసీపీ నాయకులు అసత్యాలు ప్రచారం చేస్తున్నారని అనిత మండిపడ్డారు. మిగతా 2లో...

## గణేశ్ నిమజ్జనాలు: డీజే వాహనాలను అడ్డుకోవద్దు: మంత్రి నారా లోకేశ్

వినాయక నిమజ్జనంలో డీజేలకు అనుమతులు ఇవ్వాలని మంత్రి లోకేశ్ విజ్ఞప్తి

అనుమతులు ఇవ్వకుండా పోలీసులు ఇబ్బంది పెడుతున్నారని సందేశాలు వస్తున్నాయన్న లోకేశ్

ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని హోంమంత్రి, డీజీపీని కోరిన మంత్రి

నిమజ్జనం సందర్భంగా ఒక్క డీజే వాహనాన్ని కూడా సీజ్ చేయొద్దని పోలీసులకు సూచన

**అమరావతి సింధూరదర్శిని:**
ఆంధ్రప్రదేశ్‌లో వినాయక నిమజ్జన కార్యక్రమాలకు సంబంధించి డీజే వాహనాల అనుమతులపై రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ స్పందించారు. ఉత్సవాల సందర్భంగా డీజే వాహనాలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా అనుమతులు మంజూరు చేయాలని ఆయన హోంమంత్రి అనిత, డీజీపీని



కోరారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వినాయక నిమజ్జనం కోసం ఏర్పాటు చేస్తున్న డీజే వాహనాలకు పోలీసులు అనుమతులు ఇవ్వడం లేదని పలువురు తన దృష్టికి తీసుకొచ్చారని లోకేశ్ తెలిపారు. ప్రజల నుంచి ఈ విషయంపై తనకు అనేక సందేశాలు వస్తున్నాయని ఆయన మిగతా 2లో...



## టాటా సన్స్‌లో కీలక మలుపు

ఛైర్మన్‌గా చంద్రశేఖరన్‌కు

మరో ఐదేళ్ల పొడిగింపు!

పదవి కొనసాగబోనని ఆగస్టులో

ప్రకటించిన చంద్రశేఖరన్

బోర్డు నిర్ణయంతో టాటా సన్స్‌లో

నాయకత్వంపై మలుపు

**సింధూరదర్శిని:**టాటా గ్రూప్ భవిష్యత్ నాయకత్వంపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడేలా కీలక పరిణామం చోటుచేసుకుంది. టాటా సన్స్ ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్‌కు మరో ఐదేళ్ల పదవీకాలం ఇవ్వడంతో పాటు కంపెనీని మిగతా 2లో...

## విమానాశ్రయంలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కి ఘన స్వాగతం









రేణిగుంట(సింధూరదర్శిని)
17 సెప్టెంబర్ తిరుపతి జిల్లా;
తిరుపతి జిల్లా రెండు రోజుల పర్యటన లో భాగంగా గురువారం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కి రేణిగుంట విమానాశ్రయంలో జిల్లాకలెక్టర్ డా ఎస్. వెంకటేశ్వర్, జిల్లా ఎస్పి ఎల్.సుబ్బారాయుడు, తదితరులు ఘనంగా స్వాగతం పలికారు.రేణిగుంట డిఎస్పీ శ్రీనివాసరావు, సెట్విన్ సి ఈ ఓ యస్వంత్, ఎయిర్పోర్ట్ అధికారులు, రేణిగుంట తహసీల్దార్. శ్రావణ్ కుమార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ గారికి స్వాగతం పలికన వారిలో వున్నారు.




## సెర్ప్ ద్వారా ఎస్‌హెచ్‌జీ మహిళలకు భరోసా

వివరాలు 2 లో



## ఇంద్రకీలాద్రి నుండి గణపయ్యకు పట్టు వస్త్రాలు

4 లో

# చైనా నుంచి బయటకు వెళ్లడం ఇక అంత ఈజీ కాదు..

(మొదటిపేజీ తరువాయి)

వెళ్లే హక్కుకువిరుద్ధంగా ఉందని పేర్కొంది. సెప్టెంబరు 15 నుంచి కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చాయి. జాతీయ భద్రత, ప్రమాదాల పేరుతో, స్పష్టత లేని కారణాలతో ప్రయాణాన్ని అడ్డుకునే అవకాశం అధికారులకు కల్పించారని హెచ్ఆర్‌డబ్ల్యూ ఆరోపించింది. దేశం విడిచి వెళ్లడంపై ఆంక్షలు విధించాలంటే అవి అవసరమైనవి, సముచితమైనవిగా ఉండాలని అంతర్జాతీయ మానవ హక్కుల చట్టాలు చెబుతున్నాయని సంస్థ పేర్కొంది.

హెచ్ఆర్‌డబ్ల్యూ ఆసియా విభాగం డిప్యూటీ డైరెక్టర్ మాయా వాంగ్ ఈ నిర్ణయంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఎవరిని దేశం నుంచి బయటకు వెళ్లనివ్వాలి? ఎవరిని అడ్డుకోవాలి? అన్నది అధికారులు తమ ఇష్టానుసారం నిర్ణయించే పరిస్థితి ఏర్పడుతోందని ఆమె అన్నారు. మానవ హక్కుల కార్యకర్తలు, కొన్ని మైనారిటీ వర్గాల అంతర్జాతీయ ప్రయాణాలపై ఇప్పటికే చైనా అధికారులు నిఘా, ఆంక్షలు పెంచారని తెలిపారు.

విదేశీయులపైనా ఇదే పరిస్థితి ఉండొచ్చని హెచ్ఆర్‌డబ్ల్యూ హెచ్చరించింది. 2025 జులైలో ఓ అమెరికా ప్రభుత్వ ఉద్యోగి, వెల్స్ ఫార్గో బ్యాంక్ అధికారి చైనా నుంచి బయటకు వెళ్లకుండా అధికారులు అడ్డుకున్నారని పేర్కొంది. వారిపై ఎలాంటి క్రిమినల్ కేసులు నమోదు కాలేదని తెలిపింది.

చైనా గత దశాబ్దంలో దేశం విడిచి వెళ్లే విషయంలో ఆంక్షలను క్రమంగా పెంచిందని హెచ్ఆర్‌డబ్ల్యూ పేర్కొంది. ముఖ్యంగా మతపరమైన మైనారిటీలు, మానవ హక్కుల కార్యకర్తలపై ప్రయాణ పరిమితులు పెరిగాయని తెలిపింది. 2016లో జిన్‌జియాంగ్ అధికారులు గతంలో జారీ చేసిన పాస్‌పోర్టులను స్వాధీనం చేసుకున్న తర్వాత మైనారిటీ ఉయ్ గర్ ముస్లింల విదేశీ ప్రయాణంపై ఆంక్షలు మరింత తీవ్రమయ్యాయని చెప్పింది. కొత్త నిబంధనలు భావ వ్యక్తీకరణ, విద్యా స్వేచ్ఛపై కూడా ప్రభావం చూపొచ్చని హెచ్ఆర్‌డబ్ల్యూ ఆందోళన వ్యక్తం చేసింది. దేశం విడిచి వెళ్లకుండా అడ్డుకుంటారనే భయంతో చైనా పౌరులు, విదేశీయులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడంలో వెనుకడుగు వేసే అవకాశం ఉందని పేర్కొంది.

# పదే పదే ప్రెస్‌మీట్లు పెట్టి నిరాధార వ్యాఖ్యలు చేస్తున్నారు

(మొదటిపేజీ తరువాయి)

వైసీపీ అధినేత జగన్ పదే పదే ప్రెస్‌మీట్లు పెట్టి నిరాధారమైన వ్యాఖ్యలు చేయడం అలవాటుగా మార్చుకున్నారని, అసలు వాస్తవాలు ఏమిటో ప్రజలకు స్పష్టంగా తెలుసని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలే వీరికి తగిన బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు. మరోవైపు, ఏపీపీఎస్సీ కుంభకోణం నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే వైసీపీ ఈ రాద్ధాంతం చేస్తోందని అప్పసాని రాజేశ్ ఆరోపించారు. డీఎస్సీ నియామకాలను అడ్డుకునేందుకు వైసీపీ నేతలు వేసిన 320 కేసులను న్యాయస్థానం కొట్టివేసిందని గుర్తు చేశారు. గత ఐదేళ్ల పాలనలో 'జాబ్‌లెస్ క్యాలెండర్'తో యువతను మోసం చేసిన జగన్, ఇప్పుడు అత్యంత పారదర్శకంగా జరిగిన డీఎస్సీపై అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

# గణేశ్ నిమజ్జనాలు: డీజే వాహనాలను అడ్డుకోవద్దు

(మొదటిపేజీ తరువాయి)

పేర్కొన్నారు. భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా జరుపుకునే ఈ ఉత్సవాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

ఈ నేపథ్యంలో రాష్ట్ర హోంమంత్రి అనిత, డీజీపీ వెంటనే జోక్యం చేసుకోవాలని లోకేశ్ విజ్ఞప్తి చేశారు. డీజే వాహనాలకు అనుమతులు ఇచ్చే ప్రక్రియను సులభతరం చేయాలని, ఎలాంటి జాప్యం లేకుండా వేగంగా క్లియరెన్సులు ఇవ్వాలని కోరారు. నిమజ్జనం సందర్భంగా రాష్ట్రంలో ఒక్క డీజే వాహనాన్ని కూడా పోలీసులు సీజ్ చేయకూడదని ఆయన స్పష్టంగా సూచించారు. ప్రజలు ప్రశాంతంగా, ఆనందంగా పండుగను జరుపుకునే వాతావరణం కల్పించాలని ఆయన పోలీసు శాఖకు విజ్ఞప్తి చేశారు.

# టాటా సన్స్‌లో కీలక మలుపు

(మొదటిపేజీ తరువాయి)

స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ చేసేందుకు బోర్డు ఆమోదం తెలిపింది. అయితే ఈ రెండు ప్రతిపాదనలను టాటా ట్రస్ట్స్ ఛైర్మన్ నోయెల్ టాటా వ్యతిరేకించినట్లు ఎన్‌డీటీవీ ప్రాఫిట్ కథనం పేర్కొంది.

### నోయెల్ టాటా అభ్యంతరం

టాటా ట్రస్ట్స్ తరఫున బోర్డులో నోయెల్ టాటాకు వీటో హక్కు ఉంది. చంద్రశేఖరన్ కొనసాగింపుతో పాటు లిస్టింగ్ ప్రతిపాదనపై ఆయన అసమ్మతి వ్యక్తం చేసినట్లు సమాచారం. తన వీటో అధికారాన్ని ఉపయోగించి తీర్మానాలను అడ్డుకునేందుకు ప్రయత్నించినా, ఇతర బోర్డు సభ్యుల మద్దతుతో ప్రతిపాదనలు ఆమోదం పొందినట్లు కథనం తెలిపింది.

### ఆర్‌బీఐ ఆదేశాలతో లిస్టింగ్

టాటా సన్స్ లిస్టింగ్ అంశం కొంతకాలంగా పెండింగ్‌లో ఉంది. ఆర్‌బీఐ తాజాగా కంపెనీ లిస్టింగ్ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించింది. 2022లో టాటా సన్స్‌ను 'అప్పర్ లేయర్' ఎన్‌బీఎఫ్‌సీగా ఆర్‌బీఐ గుర్తించింది. దీంతో మూడేళ్లలోగా స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ చేయాల్సిన నిబంధన ఏర్పడింది.

### చంద్రశేఖరన్ పదవీకాలం

చంద్రశేఖరన్ 2017 ఫిబ్రవరిలో టాటా సన్స్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. 2022లో ఆయనకు రెండోసారి ఐదేళ్ల పదవీకాలం లభించింది. అది 2027 ఫిబ్రవరి 20తో ముగియాల్సి ఉంది. అయితే మరోసారి బాధ్యతలు చేపట్టబోనని ఆయన ఈ ఏడాది ఆగస్టులో బోర్డుకు తెలియజేశారు.

### మళ్లీ నాయకత్వంపై మలుపు

టాటా గ్రూప్‌లో వ్యాపారాల పనితీరు, మూలధన కేటాయింపుపై నోయెల్ టాటా ఆందోళనలు వ్యక్తం చేసినట్లు సమాచారం. ముఖ్యంగా ఎయిరిండియా, టాటా డిజిటల్ అంశాలు చర్చకు వచ్చాయి. దీంతో చంద్రశేఖరన్ వారసుడి ఎంపికపై టాటా ట్రస్ట్స్ కసరత్తు ప్రారంభించింది. ఇప్పుడు బోర్డు నిర్ణయంతో ఆ వ్యవహారం మరో మలుపు తిరిగింది.

### ఏజీఎంలో తొలిసారి అంతరాయం

ఆగస్టులో జరిగిన టాటా సన్స్ వార్షిక సర్వసభ్య సమావేశం కూడా అనూహ్యంగా వాయిదా పడింది. తగినంత కోరం లేకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేయాల్సి వచ్చింది. టాటా సన్స్ చరిత్రలో ఇలాంటి ఘటన ఇదే తొలిసారి. సర్ రతన్ టాటా ట్రస్ట్‌కు సంబంధించిన పరిమితులు ఈ పరిణామానికి కారణమయ్యాయని సమాచారం.

# దేశ ప్రయోజనాల కోసం మోదీకి అండగా నిలవాలి

(మొదటిపేజీ తరువాయి)

ప్రగతిని, సంక్షేమం నుంచి సాంకేతికత వరకు చోటుచేసుకున్న మార్పులను ఆయన వివరించారు. అలాగే మోదీ నాయకత్వంలో దేశం ఏ విధంగా అభివృద్ధి చెందుతోందనే విషయాన్ని చెప్పారు. ఇక ఏపీకి కేంద్రం అందిస్తున్న సాయాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎన్నటికీ మరువలేమని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."కాశీ క్షేత్రం ప్రధాని నరేంద్ర మోదీ కర్మ భూమి. కాశీ పుణ్యక్షేత్రం నుంచి నరేంద్ర మోదీ మూడుసార్లు లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఇక్కడి ప్రజలు వారణాసికి నేతను ఎన్నుకోవడమే కాదు... దేశానికి ఓ లీడర్‌ను అందించారు. ప్రధాని నరేంద్ర మోదీ భారత్‌ను అభివృద్ధి చెందిన దేశాల సరసన చేరుస్తున్నారు. ఎఖూ అనేది అభివృద్ధి మంత్రం... ఈ మంత్రంతో దేశం అభివృద్ధి చెందుతోంది. ఎ అంటే వాద్నగర్, ఖ అంటే కాశీ, ూ అంటే సెప్టెంబర్. ప్రజలకు సేవ చేస్తే.. దేశానికి సేవ చేయడమేనని ప్రధాని నరేంద్ర మోదీ నమ్ముతారు. ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు. 80 కోట్ల మంది ప్రజలకు ఉచితంగా ఆహార ధాన్యాలు అందుతున్నాయి. జేజేఎం, అమృత్ వంటి పథకాల ద్వారా 4 కోట్ల ఇళ్లకు తాగునీటి సౌకర్యం కల్పించారు. తాగునీటి కోసం ఎవ్వరూ ఇబ్బంది పడకూడదనేది ప్రధాని కల. ఇవి కేవలం అంకెలు మాత్రమే కాదు... ఈ అంకెలు వెనుక పేద, మధ్య తరగతి కుటుంబాల అభివృద్ధి-సంక్షేమం ఉంది. పీఎం కిసాన్ కింద 11 కోట్ల మంది రైతులు లబ్ధి పొందుతున్నారు... ఇందులో ఎలాంటి మధ్యవర్తులు లేరు. నేరుగా రైతుల ఖాతాలకే నగదును జమ చేస్తున్నారు."అని ముఖ్యమంత్రి అన్నారు.

### కోవిడ్ వ్యాక్సిన్‌తో 140 కోట్ల ప్రజలను కాపాడారు

"ప్రపంచంలోని వివిధ దేశాలు సంక్షోభంలో కూరుకుపోతున్న సందర్భంలో నరేంద్ర మోదీ దేశానికి మంచి నాయకత్వం అందించారు. 140 కోట్ల మంది భారతీయులను కాపాడారు... వారికి ఇబ్బందులు కలగకుండా చేశారు. 200 కోట్ల కోవిడ్ వ్యాక్సిన్ డోసులను ఉత్పత్తి చేసేలా ప్రోత్సహించిన ప్రధాని నరేంద్ర మోదీ కరోనా బారి నుంచి ప్రజలను కాపాడారు. 101 దేశాలకు కోవిడ్ వ్యాక్సిన్లను ఉచితంగా సరఫరా చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. విశ్వ మానవాళి సంక్షేమం కోసం డబ్బులు గురించి ఎలాంటి ఆలోచన చేయకుండా కోవిడ్ వ్యాక్సిన్లను నరేంద్ర మోదీ ఉచితంగా వివిధ దేశాలకు అందించారు. ఆత్మనిర్భర్ భారత్, వోకల్ ఫర్ గ్లోబల్ ఇలాంటి విధానాలతో మేకిన్ ఇండియా కాన్సెప్ట్ బలోపేతం అయ్యేలా చేశారు. గతంలో డిఫెన్స్ పరికరాలను దిగుమతి చేసుకునేవాళ్లం.. కానీ ఇప్పుడు ఎగుమతి చేసే స్థాయికి చేరాం. టెక్నాలజీని పూర్తి స్థాయిలో అర్థం చేసుకున్న ఏకైక ప్రధాని నరేంద్ర మోదీ మాత్రమే. స్పేస్, డ్రోన్, క్వాంటం, సెమీ కండెక్టర్ టెక్నాలజీస్ వంటి వాటితో పాటు... రోబోటిక్స్ వంటి వాటిని ప్రధాని మోదీ అర్థం చేసుకోగలరు.. వాటి వల్ల యువతకు లబ్ధి చేకూర్చగలరు. గతంలో యువత ఉద్యోగాల మీద ఆధారపడేవాళ్లు. కానీ ప్రధాని దూరదృష్టితో 2.20 లక్షల స్టార్టప్ ల ద్వారా యువతే ఉద్యోగాలు కల్పించే స్థాయికి చేరుకున్నారు. ఉద్యోగాలు చేసే స్థాయి నుంచి ఉద్యోగాలు కల్పించే స్థాయికి యువత చేరారంటే దానికి ప్రధాని నరేంద్ర మోదీనే కారణం. అద్భుతమైన స్టార్టప్ ఎకో సిస్టం కలిగిన దేశాల్లో భారత్ మూడో స్థానంలో ఉంది. మహిళా సంక్షేమం, సాధికారత కోసం ప్రధాని చేస్తున్న కృషి అపూర్వం.. భేటీ బచావో-భేటీ పడావో, లక్పతీ దీదీ వంటి పథకాలే దీనికి నిదర్శనం. ఉజ్వల పథకం క్లీన్ ఫ్యూయల్ అందిస్తుంది.. ముద్ర పథకం పెట్టుబడి సమకూరుస్తుంది.. స్వయం సహాయక సంఘాలు నమ్మకాన్ని పెంచుతున్నాయి. నారీ శక్తి అధినియం ద్వారా చట్టసభల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్లు ఇవ్వబోతున్నారు.. ఇది గేమ్ ఛేంజర్ కాబోతోంది."అని సీఎం చంద్రబాబు చెప్పారు.

### తిరుగులేని శక్తిగా భారత్

"ప్రపంచం ముందు భారత్ ను తిరుగులేని శక్తిగా నిలబెడడానికి కారణం ప్రధాని మోదీ. ఇటీవలే బ్రిక్స్ సదస్సును కూడా సమర్థవంతంగా నిర్వహించారు. వివిధ దేశాల అధినేతలు మన ప్రధాని నాయకత్వంపై నమ్మకాన్ని వ్యక్తం చేశారు. ఎవరైనా దేశంపై దాడి చేయాలంటే భయపడేలా చేశారు... ఆపరేషన్ సింధూర్ ద్వారా ధీటైన జవాబుతో భారత్ శక్తిని ప్రపంచానికి చాటి చెప్పారు. ఆపరేషన్ సింధూర్ ను నిర్వహించిన రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్‌ను అభినందిస్తున్నాను. నేను కూడా వామపక్ష తీవ్రవాదాన్ని ఎదుర్కొన్నాను.. నన్ను నక్సలైట్లు టార్గెట్ చేశారు... వారికి నేనూ బాధితుణ్ణే. కానీ ఇప్పుడు దేశంలో వామపక్ష తీవ్రవాదాన్ని రూపుమాపారు... దటీజ్ నరేంద్ర మోదీ. దేశం మొత్తానికి ఒకే పవర్ గ్రిడ్ ఏర్పాటు చేసిన ఘనత ప్రధాని నరేంద్ర మోదీదే. దేశంలో కనెక్టివిటీ పెంచారు. భిన్న సంస్కృతులు, భిన్న భాషలు దేశంలో ఉన్నాయి.. కానీ దేశాభివృద్ధి, ఆత్మనిర్భరత అనేదే మన లక్ష్యం. సుస్థిరత వల్లే ఇది సాధ్యమవుతుంది. సుస్థిరత వల్ల నమ్మకం పెరుగుతుంది.. నమ్మకం వల్ల పెట్టుబడులు వస్తాయి.. పెట్టుబడులు వల్ల ఉద్యోగాలు సమకూరుతాయి.. అభివృద్ధి జరుగుతుంది. ఉద్యోగాల వల్ల ప్రజలకు మేలు జరుగుతుంది. వందే భారత్ రైళ్లను ప్రారంభించారు.. బుల్లెట్ ట్రైన్లు రాబోతున్నాయి. నదుల అనుసంధానం మాత్రమే ఇంకా పెండింగులో ఉంది... ఈ నదుల అనుసంధానం ప్రధాని నరేంద్ర మోదీ ద్వారానే సాధ్యమవుతుంది. బ్రహ్మపుత్ర, గంగ, మహానది, కావేరి, గోదావరి నదులను అనుసంసంధానం చేస్తే భారత్ అన్ స్టాపబుల్. 25 ఏళ్ల పాటు కంటిన్యూగా పాలనలో ఉండడం మామూలు విషయం కాదు. దేశంలో.. ప్రపంచంలో కూడా ఈ విధంగా రాజ్యాంగ పదవిలో ఉండడం సాధ్యం కాదు. ప్రధాని నరేంద్ర మోదీ సమాజాన్ని చదివారు... చాలా నేర్చుకున్నారు... దానికి అనుగుణంగా పాలన చేపట్టారు. 2003లో గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉండగా నరేంద్ర మోదీ వైబ్రంట్ గుజరాత్ అనే కార్యక్రమం నిర్వహించారు.. ఇప్పుడది గ్లోబల్ బ్రాండ్ గా మారింది. నరేంద్ర మోదీ సారథ్యంలో అభివృద్ధి పట్టణాలకే కాదు... గ్రామీణ ప్రాంతాలకు చేరింది. సబ్ కా సాత్.. సబ్ కా వికాస్.. సబ్ కా విశ్వాస్.. సబ్ కా ప్రయాస్ ఇదే ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యం."అని ముఖ్యమంత్రి అన్నారు.

### త్రేతాయుగం.... కలియుగం...

"కోట్లాది భక్తులు మహా కుంభమేళాకు వారణాసి వచ్చారు. మహా కుంభమేళాను యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ అద్భుతంగా నిర్వహించారు. సుదీర్ఘ కాలంగా పెండింగులో ఉన్న అయోధ్య రామ మందిరం నిర్మాణాన్ని పూర్తి చేశారు. కలగా ఉండే రామ మందిర నిర్మాణాన్ని నరేంద్ర మోదీ నిజం చేశారు. త్రేతాయుగ దైవమైన శ్రీరాముని జన్మస్థలం అయోధ్యలో కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి ఆలయం నిర్మించాలని భావిస్తున్నాం. వెంకన్న ఆలయ నిర్మాణానికి 10 ఎకరాలు కేటాయించాలి."అని సీఎం చంద్రబాబు యూపీ ముఖ్యమంత్రిని కోరారు.

### సభికులను ఇన్‌వాల్వ్ చేస్తూ సాగిన చంద్రబాబు ప్రసంగం

సీఎం చంద్రబాబు హిందీలో తన ప్రసంగాన్ని ప్రారంభించడంతో సభికుల్లో ఉత్సాహం నెలకొంది. ప్రసంగం మొత్తం సభికులను ఇన్‌వాల్వ్ చేస్తూ సాగడంతో పలుమార్లు పెద్ద ఎత్తున చప్పట్లు, హర్షధ్వానాలు వినిపించాయి. రామజన్మభూమి నుంచి ఆపరేషన్ సింధూర్ వరకు వివిధ అంశాలను ప్రస్తావిస్తూ, ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం సాధిస్తున్న ప్రగతితో పాటు ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం అందిస్తున్న సహకారాన్ని కూడా ఆయన వివరించారు. ఆజ్ మే కాశీకే పవిత్ర ధర్తీ పర్ ఖడా హూ... యే మేరేలియే గర్వ్ కా క్షణ్ హై అంటూ సీఎం చంద్రబాబు హిందీలో తన ప్రసంగాన్ని ప్రారంభించారు. ఇక ప్రసంగం మధ్య మధ్యన దేశ్ బదల్ రహా హై, దేశ్ ఆగే బఢ్ రహా హై, నయా భారత్ హై.... ఆత్మ నిర్భర్ భారత్ హై అంటూ వ్యాఖ్యానించారు. చివరిలో ఏక్ భారత్, శ్రేష్ట్ భారత్, వికసిత్ భారత్... యహీ హమారా సంకల్ప్ హై అంటూ ముఖ్యమంత్రి తన ప్రసంగాన్ని ముగించారు. ముఖ్యమంత్రి ప్రసంగానికి సభికుల నుంచి అతిథుల నుంచి ప్రశంసలు లభించాయి. తన ప్రసంగం ప్రారంభానికి ముందు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చంద్రబాబును ప్రత్యేకంగా అభినందించారు. చంద్రబాబు చాలా అద్భుతంగా మాట్లాడారు... వెరీ వెల్.. వెరీ వెల్ అంటూ ప్రశంసించారు. చంద్రబాబు ప్రసంగానికి చప్పట్లతో అభినందనలు తెలపాలని సభికులను కోరారు. దీంతో రుద్రాక్ష్ కన్వెన్షన్ సెంటర్ హర్షధ్వానాలతో మార్మోగింది. ఈ కార్యక్రమంలో చంద్రబాబు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో తన కుటుంబానికున్న అనుబంధాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. తన తండ్రి, దివంగత రామ్‌విలాస్ పాశ్వాన్‌కు చంద్రబాబు అత్యంత సన్నిహితుడని, తన తండ్రి కష్టసుఖాల్లో ఆయనకు అండగా నిలిచారని గత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు.

# సెర్ప్ ద్వారా ఎస్‌హెచ్‌జీ మహిళలకు భరోసా

**డ్వాక్రా మహిళల ఆర్థిక పురోగతి, జీవనోపాధుల విస్తరణే లక్ష్యం**

**బ్యాంకు రుణాలు, బీమా రక్షణపై మంత్రి కొండపల్లి సమీక్ష**



విజయవాడ సింధూరదర్శిని: రాష్ట్రంలో స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థిక సాధికారత, జీవనోపాధి అవకాశాల విస్తరణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడించారు. విజయవాడలోని ఎన్‌టీఆర్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్‌లో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ కార్యాలయంలో గురువారం సెర్ప్ సీఈవో వాకాటి కరుణ, సెర్ప్ డైరెక్టర్లతో వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతిపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 1,02,009 ఎస్‌హెచ్‌జీ సంఘాలకు రూ.15,054కోట్ల బ్యాంకు రుణాలు అందించినట్లు అధికారులు మంత్రికి సూచించగా... నిర్దేశించుకున్న రూ.36,000 కోట్ల లక్ష్యాన్ని చేరుకునేలా బ్యాంకర్లతో సమన్వయం పెంచాలని మంత్రి ఆదేశించారు. స్త్రీనిధి ద్వారా 4.73 లక్షల మంది మహిళలకు రూ.4,800 కోట్ల రుణాలు పంపిణీ చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. బ్యాంకులు మంజూరు చేసే క్యాష్ క్రెడిట్ రుణాలపై ప్రాసెసింగ్, డాక్యుమెంటేషన్, ఇన్‌స్పెక్షన్ ఛార్జీల మినహాయింపు నిబంధనలపై మహిళలకు అవగాహన కల్పించాలని... గ్రామీణ సభలు, సమాఖ్యల నెలవారీ సమావేశాల అజెండాలో ఈ అంశాన్ని చేర్చాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రతి ఎస్‌హెచ్‌జీ మహిళకు 'ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన', 'ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన' పథకాల కింద బీమా రక్షణ కల్పించాలని.. జిల్లా సమాఖ్యల ఇన్సూరెన్స్ కాల్ సెంటర్ల ద్వారా క్లెయిమ్‌ల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్‌హెచ్‌జీ మహిళలు తయారు చేసే 65 రకాల ఉత్పత్తులను విక్రయించడానికి 4 స్వయం బ్రాండ్ సిగ్నేచర్ స్టోర్ల ప్రారంభానికి ఏర్పాట్లు పూర్తి చేయాలని తెలిపారు. జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ కింద రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి, ఆధునిక లాండ్రీ, బ్యూటీ పార్లర్, హెయిర్ కటింగ్ వంటి వృత్తి నైపుణ్యాలలో మహిళలకు, చేతివృత్తిదారులకు శిక్షణ ఇస్తామని మంత్రి తెలిపారు. ఎఫ్‌పీఓల ఆధ్వర్యంలో నడిచే కస్టమ్ హైరింగ్ సెంటర్ల ద్వారా తక్కువ అద్దెకే రైతులకు యంత్ర పరికరాలు అందుబాటులో ఉంచి, సాగు ఖర్చులు తగ్గించేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంత మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్ది, వారి కుటుంబాలకు స్థిరమైన ఆదాయం అందించేలా సెర్ప్ అధికారులు నిరంతరం శ్రమించాలని మంత్రి కొండపల్లి పిలుపునిచ్చారు.

# సీనియర్ నాయకులు శివకుమార్ మృతి బాధాకరం

**నివాళులర్పించిన ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్**

గూడూరు( సింధూర దర్శిని) 17 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా; పట్టణంలోని శాంతినగర్ నందు నివాసముంటున్న టిడిపి సీనియర్ నాయకులు , రాష్ట్ర ఎస్సీ కమిటీ సభ్యులు గోను శివకుమార్ మృతి బాధాకరమని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా శివకుమార్ భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, శివ కుమార్ అంతిమయాత్రలో పాల్గొన్నారు.

ఈ అంతిమయాత్రలో నాయకులు , పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





# స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి

**పెండింగ్‌లో ఉన్న 2024 సాధారణ ఎన్నికల హింసాత్మక ఘటనల కేసులను త్వరితగతిన పరిష్కరించాలి**

**రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వివేక్ యాదవ్**



నెల్లూరు (సింధూరదర్శిని) 17 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా; స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వివేక్ యాదవ్ అన్నారు.గురువారం అమరావతి నుండి రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వివేక్ యాదవ్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం ప్రస్తుత పురోగతి, పెండింగ్‌లో ఉన్న పనులపై ఆయన సమీక్ష నిర్వహించారు.

నెల్లూరు జిల్లా కలెక్టరేట్ లోని శంకరణ్ హాలు నుండి కలెక్టర్ హిమాన్షు శుక్లా, డిఆర్వో విజయకుమార్, తదితరులు ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వివేక్ యాదవ్ మాట్లాడుతూ సర్ కార్యక్రమానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న పనులను గుర్తించి, వాటిని వేగవంతం చేయాలని, నిర్దేశిత గడువులోగా అన్ని పనులను పూర్తి చేసేలా సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రతి దశలో పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా, 2024 సాధారణ ఎన్నికలకు సంబంధించిన పెండింగ్‌లో ఉన్న హింసాత్మక ఘటనల కేసులను త్వరితగతిన పరిశీలించి, అవసరమైన చర్యలు చేపట్టి, కేసులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అంతకు ముందు సర్ కార్యక్రమం, పెండింగ్‌లో ఉన్న హింసాత్మక ఘటనల కేసులు, పరిష్కారం పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా వివరించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పోలీస్ అధికారులు, ఎన్నికల విభాగానికి చెందిన అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సృష్టి, శ్రమ, సాంకేతిక నైపుణ్యానికి విశ్వకర్మ జయంతి ప్రతీక

**జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా**



నెల్లూరు (సింధూరదర్శిని) 17 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా; సృష్టి, శ్రమ, సాంకేతిక నైపుణ్యానికి ప్రతీకగా దేవశిల్పి విశ్వకర్మను భావిస్తారని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు.గురువారం విశ్వకర్మ జయంతి సందర్భంగా నెల్లూరు కలెక్టరేట్లోని ఎస్.ఆర్.శంకరన్ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. హిందూ పురాణాల ప్రకారం విశ్వకర్మను దైవిక వాస్తుశిల్పి, శిల్పి, ఇంజనీర్‌గా భావిస్తారని తెలిపారు.శిల్పకళ, వాస్తుశాస్త్రం, నిర్మాణరంగం, యంత్ర నిర్మాణం, సాంకేతిక నైపుణ్యాలకు విశ్వకర్మ ఆద్యుడిగా పూజించబడుతున్నారని పేర్కొన్నారు. పురాణ గాథల ప్రకారం శ్రీకృష్ణుడు పరిపాలించిన ద్వారకా నగరం, పాండవుల ఇంద్రప్రస్థ రాజభవనం, లంకా నగరం వంటి అద్భుత నిర్మాణాలను విశ్వకర్మ నిర్మించినట్లు ప్రసిద్ధి చెందిందన్నారు. దేవతలకు అవసరమైన అనేక దివ్య ఆయుధాలు, రథాలు, ఇతర పరికరాలను కూడా ఆయన రూపొందించినట్లు పురాణాలు పేర్కొంటున్నాయని తెలిపారు. పురాణ సంప్రదాయం ప్రకారం విశ్వకర్మకు సంబంధించిన పంచముఖాల నుంచి మను, మయ, త్వష్ట, శిల్పి, విశ్వజ్ఞ అనే ఐదుగురు శిల్పాచార్యులు ఉద్భవించినట్లు విశ్వసిస్తారని తెలిపారు. శిల్ప, వాస్తు, నిర్మాణ, సాంకేతిక విజ్ఞానాల అభివృద్ధిలో వీరి పాత్రను సంప్రదాయంగా గుర్తిస్తారని పేర్కొన్నారు.విశ్వకర్మ జయంతిని ముఖ్యంగా కర్మాగారాలు, పారిశ్రామిక సంస్థలు, వర్క్‌షాప్‌లు, నిర్మాణ రంగ సంస్థలు, ఇతర సాంకేతిక పని ప్రదేశాల్లో ప్రత్యేకంగా నిర్వహిస్తారని తెలిపారు. శిల్పులు, వడ్రంగులు, కమ్మరులు, మెకానిక్‌లు, వెల్డర్లు, ఇంజనీర్లు, సాంకేతిక నిపుణులు, పారిశ్రామిక కార్మికులు తమ వృత్తికి సంబంధించిన పనిముట్లు, యంత్రాలు, పరికరాలను పూజించడం ఈ పర్వదినం ప్రత్యేకత అన్నారు.తమ వృత్తిలో నైపుణ్యం, అభివృద్ధి, విజయాలు సాధించాలని, యంత్రాలు సజావుగా పనిచేయాలని, పని ప్రదేశాల్లో ప్రమాదాలు లేకుండా సురక్షితమైన వాతావరణం కలగాలని కార్మికులు విశ్వకర్మను ప్రార్థిస్తారని తెలిపారు. సమాజ అభివృద్ధిలో కార్మికులు, శిల్పులు, సాంకేతిక నిపుణుల శ్రమ ఎంతో కీలకమని, వారి కృషిని గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. సృష్టి, శ్రమ, సాంకేతిక నైపుణ్యం, వృత్తి గౌరవానికి ప్రతీకగా విశ్వకర్మ జయంతి నిలుస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. విశ్వకర్మ జయంతి స్ఫూర్తితో వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకుంటూ సమాజ, దేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో విజయ కుమార్, సమాచార పౌర సంబంధాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మోడీ జన్మదిన వేడుకలు



**బిజెపి పట్టణ అధ్యక్షులు కే.దయాకర్**

గూడూరు( సింధూర దర్శిని) 17 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా ; దేశ ప్రధాని నరేంద్ర మోడీ 76వ జన్మదిన వేడుకలను గూడూరు పట్టణ బీజేపీ కమిటీ గురువారం ఘనంగా నిర్వహించారు. పట్టణ బీజేపీ అధ్యక్షులు కే. దయాకర్ ఆధ్వర్యంలో పార్టీ కమిటీ సభ్యులు గూడూరు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని రోగుల సమక్షంలో కేక్ కట్ చేసి, అనంతరం కేక్‌ను అందరికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగుల సమక్షంలో ప్రధాని నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలను నిర్వహించడం సంతోషదాయకమన్నారు. మోడీ ప్రభుత్వం తీసుకొస్తున్న పలు సంస్కరణలు దేశాభివృద్ధికి దోహదపడటంతో పాటు ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. బీజేపీ పట్టణ అధ్యక్షులు కే. దయాకర్ మాట్లాడుతూ నరేంద్ర మోడీ రాజకీయ ప్రస్థానం 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన జన్మదిన వేడుకలను నిర్వహిస్తున్నామన్నారు. 13 సంవత్సరాలు గుజరాత్ ముఖ్యమంత్రి గా అనంతరం భారత ప్రధానిగా 12 సంవత్సరాలకు పైగా సేవలందిస్తూ అనేక సంస్కరణలను అమలు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యనిర్వాహక సభ్యులు, గూడూరు పట్టణ శివాలయం దేవస్థానం చైర్మన్ బాలకృష్ణ నాయుడు మాట్లాడుతూ నరేంద్ర మోడీ ఆలోచనలు, ఆశయాలు ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. జిల్లా మహిళా మోర్చా నాయకురాలు బిందు మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ మహిళలకు రాజకీయాల్లో మరింత ప్రాధాన్యత కల్పించే దిశగా 33 శాతం రిజర్వేషన్‌కు సంబంధించిన చర్యలు చేపట్టడం ద్వారా మహిళా సాధికారతకు ప్రాధాన్యత ఇచ్చారని పేర్కొన్నారు.ా

ఈ కార్యక్రమంలో పట్టణ బీజేపీ ప్రధాన ప్రధాన కార్యదర్శులు పర్చూరు బాలకృష్ణ గౌడ్, ఎం రవీంద్ర ఉపాధ్యక్షులు గుమ్మడి శ్రీనివాసులు, పట్టణ కమిటీ కోశాధికారి నిరంజన్, నీలిధనంజయ ,మహిళా మోర్చా అధ్యక్షులు బాలామణి, యువ మోర్చా అధ్యక్షులు శివకుమార్, ఓబీసీ మోర్చా అధ్యక్షులు కటికాలసురేష్, బిజెపి సీనియర్ నాయకులు తూపిలి రమేష్, లక్ష్మి, మహిళా నాయకులు పాల్గొన్నారు.



## మూషిక వాహనంపై ఊరేగిన గణపయ్య

**ఊరేగింపులో అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు , గ్రామ ప్రజలు**

కాణిపాకం( సింధూరదర్శిని)17 సెప్టెంబర్ చిత్తూరు జిల్లా ; కాణిపాకం స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల భాగంగా గురువారం రాత్రి సిద్ధి బుద్ధి సమేత శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారు మూషిక వాహన పై కాణిపాకం పురవీధుల్లో దర్శనమిచ్చారు.



# నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా తిరుమలలో ఆశీర్వాద్ కా దియా

**దీపాలు వెలిగించిన ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి**

**మోదీకి జన్మదిన శుభాకాంక్షలు**



నెల్లూరు (సింధూర దర్శిని)17 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా; ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం అలాగే వారు ప్రజా సేవలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా, 'సేవా సంకల్ప్ అభియాన్' పిలుపు మేరకు శుక్రవారం తిరుమల కొండపై 'ఆశీర్వాద్ కా దియా'కార్యక్రమాన్ని కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి నిర్వహించారు. ఈ శుభ సందర్భంగా తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి సన్నిధిలో భక్తిశ్రద్ధలతో దీపాలు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.ఈ సందర్భంగా ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారికి శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని, వారు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అంతేకాకుండా, ఎమ్మెల్యే సూచనల మేరకు కోవూరులోని తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో కూడా పార్టీ నాయకులు,కార్యకర్తలు విశేషంగా పాల్గొని దీపాలు వెలిగించి ప్రధాని పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. నరేంద్ర మోదీ 25 ఏళ్ల సుదీర్ఘ ప్రజాసేవకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ, దేశానికి వారి అమూల్యమైన సేవలు ఇలాగే నిరంతరం కొనసాగాలని ఆకాంక్షించారు.

# నేడు ఉద్యోగులు, ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక గ్రీవెన్స్ డే

**జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల**



నెల్లూరు( సింధూర దర్శిని) 17 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా ; ప్రభుత్వ ఆదేశాల మేరకు నేడు ఉద్యోగుల గ్రీవెన్స్ డే, ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక గ్రీవెన్స్ డే ను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతినెలా మూడో శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఉద్యోగుల ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నెల్లూరు కలెక్టరేట్ లోని తిక్కన ప్రాంగణంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు, సంఘాలు తమ సమస్యలు, వినతులను నేరుగా జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావడానికి ఈ ప్రత్యేకప్రజాఫిర్యాదుల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఇందుకు సంబంధించి ఐటీడీఏ ప్రాజెక్టు డైరెక్టర్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు ముందస్తుగా ఎస్సీ ఎస్టీ అభ్యర్థులు, సంఘాలకు సమాచారం అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పిలుపునిచ్చారు.

# ఘనంగా మోదీ జన్మదిన వేడుకలు

**– కంకణాల పెంచలనాయుడు –**




గూడూరు (సింధూర దర్శిని) 17 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా ; మన భారత దేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీ పుట్టిన రోజు శుభసందర్భంగా గూడూరు పట్టణంలో గాంధీ బొమ్మ సెంటర్లో హీరాబెన్ మాతాజీ గ్లోబల్ ట్రస్టు ఆలిండియా ప్రెసిడెంట్ కంకణాల పెంచల నాయుడు ఆధ్వర్యంలో గురువారం కేక్ కట్ చేసి ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. అనంతరం పేద ప్రజలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ యారం వెంకట సుబ్బయ్య ,జాయింట్ సెక్రటరీ శ్రీగౌరి,జనరల్ సెక్రటరీ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాలను పునః ప్రారంభించాలి

**నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ నాయకులు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బంద్**

గూడూరు( సింధూర దర్శిని) 17 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా ; కోట గురుకుల పాఠశాలను పున ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ , గూడూరు నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజా సంఘాలు రాజకీయ పార్టీ నాయకులు ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు.కోట గురుకుల పాఠశాలను పున ప్రారంభించాలని ప్రజాసంఘాలు పలు రాజకీ పార్టీ నాయకులు ఆధ్వర్యంలో గూడూరు నియోజకవర్గ వ్యాప్త బందులో భాగంగా పలు పాఠశాలలు కళాశాలలు దుకాణాలను నాయకులు మూయించారు. నాయకులు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా కోట గ్రామంలో ఉన్న గురుకుల పాఠశాలను తొలగించడంతో 600 మంది విద్యార్థుల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వీరిని నాయుడుపేట , చిల్లకూరు గురుకుల పాఠశాలలకు తరలించార ని అక్కడ సరైన వసతులు లేవని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గురుకుల పాఠశాలను పున ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలు రాజకీయ పార్టీలు మరియు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.









# పేదవారికి దశ దిశ మార్చే ఏకైక మార్గం చదువే



**రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధినేత రాజనేని శ్రీనివాసులు నాయుడు**

గూడూరు (సింధూరదర్శిని) 17 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా; చిల్లకూరు మండల పరిధిలోని చింతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధినేత రాజనేని శ్రీనివాసులు నాయుడు దాతృత్వంతో మండలంలోని జడ్పీ ఉన్నత పాఠశాలల్లో చదివే 1600 మంది విద్యార్థులకు అలాగే 200మంది ఉపాధ్యాయులకు సుమారు 1లక్ష 50 వేలు రూపాయలతో ఐడి కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన శ్రీనివాసులు నాయుడుకి విద్యార్థులు, ఉపాధ్యాయులు పూలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాను చదువుకునే రోజుల్లో ఐడి కార్డులు లేవని, సీఏ చేసిన ఆయనకు వాటిని ధరించే పరిస్థితి లేదని, ఐడి కార్డును ధరించాలనే కోరిక పేద విద్యార్థులకు అందించడం ద్వారా ఆయనకు ఆ కోరిక తీరిందని తెలియజేశారు. ఆయన చదువుకునే రోజుల్లో ఆర్థిక స్తోమత లేక తాను అనుభవించిన బాధ పేద విద్యార్థులు పడకూడదనే ఉద్దేశంతో గోరుముద్ద అనే కార్యక్రమాన్ని ప్రారంభించి విద్యార్థులకు సాయంత్రం పూట అల్పాహారం అందించడం జరుగుతుందని, పేదవారికి దశ, దిశను మార్చే ఏకైక మార్గం చదివేనని, నేటి తరం విద్యార్థులు సోషల్ మీడియాను పరిజ్ఞానం కోసమే ఉపయోగిస్తూ చక్కగా చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని, తెలియజేశారు. అనంతరం ఆయన్ను పాఠశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రధానకార్యదర్శి రాజనేని రామానాయుడు, నెల్లూరు అర్బన్ మరియు స్థానిక ఎంఈఓ లు హమీద్,రావూఫ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివ సుబ్రహ్మణ్యం, బాబు, ప్రజేంద్రారెడ్డి, మండలంలోని అన్ని పాఠశాలల ఉపాధ్యా యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





## విద్యార్థుల భవిష్యత్తు కోసం సేవ చేయడం ఎంతో సంతోషం

గూడూరు( సింధూర దర్శిని) 17 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా; గూడూరు రూరల్ మండలం పారిచర్ల రాజాపాలెం గ్రామంలోని అంగన్‌వాడి కేంద్రంలో విద్యార్థులకు కుర్చీలు, విద్యా సామగ్రి వితరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించాలనే ఉద్దేశంతో రోటరీ క్లబ్ గూడూరు వెస్ట్ ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి రోటేరియన్ కనుమర్లపూడి శ్రీనివాసరావు దాతగా వ్యవహరించారు. అంగన్‌వాడి కేంద్రం, ఎలిమెంటరీ పాఠశాలలో విద్యార్థులకు ఉపయోగపడే విధంగా కుర్చీలు, అవసరమైన విద్యా సామగ్రిని అందజేశారు. విద్యార్థులు సౌకర్యవంతంగా కూర్చొని చదువుకునేందుకు అవసరమైన సదుపాయాలను కల్పించడం పట్ల పాఠశాల, అంగన్‌వాడి సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ గూడూరు వెస్ట్ అధ్యక్షుడు ఆర్‌టీఎన్. ఎన్.కృష్ణంరాజు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు కోసం సేవ చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. సమాజంలో అవసరమైన ప్రాంతాలను గుర్తించి సేవా కార్యక్రమాలు నిర్వహించడం రోటరీ క్లబ్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు చదువుకునే పాఠశాలలు, అంగన్‌వాడి కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు తమ వంతు సహకారం అందిస్తామని చెప్పారు. విద్యార్థులకు మంచి విద్యా వాతావరణం కల్పిస్తే వారి భవిష్యత్తుకు మరింత ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. విద్య, వైద్యం, పారిశుధ్యం, పర్యావరణ పరిరక్షణ వంటి సామాజిక అంశాలపై రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఎన్. కృష్ణం రాజు తెలిపారు. ఈ కార్యక్రమానికి గ్రామ అధ్యక్షుడు రాజు వెంకటేశ్వర రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అలాగే రోటరీ క్లబ్ గూడూరు వెస్ట్ కార్యదర్శి ఆర్‌టీఎన్. ఎం.హరనాథ్‌రెడ్డి, అంగన్‌వాడి టీచర్ కే.కవిత, టీచర్ జైకల్యాణ్, బి.ధనుంజయరెడ్డి, శ్రీనివాసులు, ఎం.సుబ్రహ్మణ్యంరాజు, ఏ.బలరాంరెడ్డి, ఎస్.కె.మహబూబా, సీడీపీఓ సుజనా, సూపర్‌వైజర్‌తో పాటు పాఠశాల, అంగన్‌వాడి సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు. విద్యార్థులకు అవసరమైన సదుపాయాలను అందించిన రోటరీక్లబ్ గూడూరు వెస్ట్ సభ్యులకు గ్రామస్తులు, పాఠశాల సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

## దేశానికి ఇంకా ఎన్నో సేవలు అందించాలి

**ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్**



గూడూరు( సింధూర దర్శిని) 17 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా ; భారతదేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రజాసేవలో 25సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వారు ప్రజా సేవలో ఉంటూ దేశానికి ఇంకా ఎన్నో సేవలు అందించాలని కోరుకుంటూ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ దీపం వెలిగించి కృతజ్ఞతలు తెలిపారు.

## సర్‌పై జిల్లా ఎన్నికల అధికారులతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వీడియో కాన్ఫరెన్స్

**సెప్టెంబర్ 21, 22 నాటికి పెండింగ్ కేసులు, విచారణలు పూర్తి చేయాలి**

**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్**

**తిరుపతి జిల్లాలో 4 లక్షల కేసులకు గాను 3.77 లక్షల కేసులు పూర్తి**

**జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్**



తిరుపతి (సింధూరదర్శిని) 17 సెప్టెంబర్ తిరుపతిజిల్లా;ప్రత్యేక విస్తృత పునర్విమర్శ సర్ కార్యక్రమం అమలుపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ గురువారం సచివాలయం నుంచి జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. రాష్ట్ర వ్యాప్తంగా సర్-2026లో భాగంగా కొనసాగుతున్న ఎన్నికల ప్రక్రియ, ఓటర్ల జాబితా పునర్విమర్శ, క్షేత్రస్థాయిలో చేపడుతున్న పరిశీలన, నోటీసులు, దరఖాస్తుల పరిష్కారం, విచారణలు తదితర అంశాలపై జిల్లా వారీగా పురోగతిని సమీక్షించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు తిరుపతి జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు, తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ ఎం.జయకృష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులులతో కలసి జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ సర్-2026 కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిర్దేశిత కాలపరిమితికి అనుగుణంగా సమర్థవంతంగా పూర్తి చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న కేసులు, దరఖాస్తులు, విచారణలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, ఓటర్ల జాబితా పునర్విమర్శ ప్రక్రియలో పారదర్శకత, ఖచ్చితత్వం ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఎన్నికల సిబ్బందికి అవసరమైన సూచనలు, మార్గదర్శకాలు అందిస్తూ ప్రక్రియ సజావుగా జరిగేలా జిల్లా ఎన్నికల అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాలో మొత్తం 4 లక్షల కేసులకు గాను 3.77 లక్షల కేసులు పూర్తయ్యాయని, సుమారు 25 వేల కేసులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని, ఇవి మొత్తం కేసుల్లో 6శాతం కంటే తక్కువగా ఉన్నాయని కలెక్టర్ వివరించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను సెప్టెంబర్ 21 లేదా 22వ తేదీ నాటికి పూర్తి చేసి, సంబంధిత విచారణలను కూడా ముగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నోటీసుల జారీ ప్రక్రియలో దాదాపు 10.80 లక్షల నోటీసులు పూర్తయ్యాయని తెలిపారు. మొత్తం 4 లక్షల కేసుల్లో 3.44 లక్షల దరఖాస్తులు తుది ప్రచురణకు ఆమోదించబడ్డాయని, సుమారు 10 వేల దరఖాస్తులు మాత్రమే అనర్హమైనవిగా నిర్ధారించబడ్డాయని తెలిపారు. మిగిలిన 25 వేల కేసులపై విచారణ పూర్తయిన వెంటనే తదుపరి ప్రక్రియను పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఫారమ్-6కు సంబంధించి 14,800 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, తిరస్కరణల విషయంలో ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా తగిన జాగ్రత్తలు తీసుకుంటూ పరిశీలన కొనసాగిస్తున్నామని తెలిపారు. ఫారమ్--7కు సంబంధించి కేవలం 421 దరఖాస్తులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఫారమ్-8కు సంబంధించి సుమారు 10వేల దరఖాస్తులు ఉన్నాయని, వీటిలో అధిక శాతం తిరుపతి నియోజకవర్గానికి సంబంధించిన చిరునామా మార్పు దరఖాస్తులేనని, వాటిని వేగవంతంగా పరిష్కరిస్తున్నామని వివరించారు. బిఎల్‌ఓల స్థాయిలో ఫోటోల అప్‌డేషన్ ప్రక్రియ 75 శాతం పూర్తయిందని, అందులో ఈ ఆర్ ఓ స్థాయిలో సుమారు 50శాతం ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. పెద్ద సంఖ్యలో వివరాలు ఉండటం వల్ల కొంత సమయం పడుతున్నప్పటికీ, నిర్దేశిత గడువులోగా ప్రక్రియను పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్నికల సందర్భంగా నమోదైన పోలింగ్ డే, పోస్ట్-పోలింగ్ కేసుల పురోగతిని కూడా సమీక్షించారు. మొత్తం కేసుల్లో సుమారు 89.3 శాతం కేసులకు సంబంధించి చార్జ్‌షీట్ ప్రక్రియ పూర్తై కోర్టు విచారణ దశలో ఉన్నాయని, మరో 7.1శాతం కేసుల్లో చార్జ్‌షీట్ దాఖలైనప్పటికీ జిల్లా కోర్టుల నుంచి సిసి నంబర్ రావాల్సి ఉందని అధికారులు వివరించారు. అలాగే, పుల్లంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన రెండు కేసులు ఇటీవల తిరుపతి జిల్లా పరిధిలోకి వచ్చిన నేపథ్యంలో, వాటి దర్యాప్తును వేగవంతం చేసి త్వరితగతిన తదుపరి న్యాయ ప్రక్రియకు తీసుకెళ్లేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు భరత్ నాయక్, నాగార్జున, తిరుపతి డిప్యూటీ మునిసిపల్ కమీషనర్ అమరయ్య, డిఆర్డిఏ పిడి శోభన్ బాబు, ఎన్నికల విభాగం సిబ్బంది భాగ్యలక్ష్మి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంద్రకీలాద్రి నుండి గణపయ్యకు పట్టు వస్త్రాలు

**ఆలయ ఈవో పెంచల కిషోర్**





కాణిపాకం (సింధూరదర్శిని)17 సెప్టెంబర్ చిత్తూరు జిల్లా; కాణిపాకం స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం 2026 వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రి విజయవాడ దేవస్థానం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించిన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం ఈ.వో శీనా నాయక్, చైర్మన్ బోర్ర రాధాకృష్ణ (గాంధీ) వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లుచేసి స్వామి వారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రం, చిత్రపటాన్ని అందజేసిన దేవస్థానం ఈ.వో పెంచల కిషోర్, చైర్మన్ మణినాయుడు ఈ కార్యక్రమంలో కాణిపాకం దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ సభ్యులు చంద్రశేఖర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, నరేష్, శివప్రసాద్, రాజ్యలక్ష్మి, కృష్ణవేణి, వసంత, శ్రీవాణి, విజయవాడ దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ సభ్యులు, కాణిపాకం దేవస్థానం ఏఈఓ రవీంద్రబాబు, ధనపాల్, ధనంజయ, సూపర్డెంట్లు వాసు, కోదండపాణి, అర్చకులు వేద పండితులు తదితరులు పాల్గొన్నారు.





# ఎన్టీఆర్ కాలం నుంచి టీడీపీకి అండగా ఉన్నారు

స్థానిక ఎన్నికల్లోనూ అదే ఆదరణ కావాలి

మాదిగల ఆత్మీయ సమ్మేళనం'లో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి

రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తా

ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిలతో కలిసి సమస్యల పరిష్కారానికి చొరవ

మాదిగల సమస్యల విషయంలో ఎవరూ చిన్నచూపు చూడకూడదన్నదే చంద్రబాబు విధానం

రాబోయే స్థానిక ఎన్నికల్లోనూ ఆశీర్వదించాలని విజ్ఞప్తి

నెల్లూరు( సింధూరదర్శిని) 17 సెప్టెంబర్ నెల్లూరుజిల్లా; నెల్లూరు పార్లమెంటు పరిధిలోని మాదిగ సామాజిక వర్గ సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని, వారణాసిలో ప్రధాని నరేంద్రమోదీ పుట్టినరోజు కార్యక్రమంలో పాల్గొనాల్సి ఉన్నప్పటికీ, మాదిగ సోదరులకు ఇచ్చిన మాటకు మొదటి ప్రాధాన్యం ఇచ్చి ఈ కార్యక్రమానికి హాజరైనట్లు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. గురువారం నెల్లూరులో నిర్వహించిన 'మాదిగల ఆత్మీయ సమ్మేళనం'లో ఎంపీ వేమిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకుందామని ఇచ్చిన మాట ప్రకారమే ఈ కార్యక్రమానికి హాజరైనట్లు వెల్లడించారు.

### తెలుగుదేశంపార్టీతోనే మాదిగల ప్రయాణం

ఎన్టీఆర్ హయాం నుంచీ మాదిగ సామాజిక వర్గం తెలుగుదేశం పార్టీతోనే నిలబడిందని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి గుర్తుచేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలోనే మాదిగ సామాజిక వర్గానికి నిజమైన మేలు జరిగిందని అన్నారు. మాదిగ వర్గానికి చెందిన ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం వస్తే ఎవరూ చిన్నచూపు చూడకూ డదని, వారికి ఆప్యాయంగా సాయం చేయాలని చంద్రబాబు తరచూ చెబుతుంటారని తెలిపారు. నెల్లూరు జిల్లాలో కూడా తెలుగుదేశం పార్టీకి మాదిగ సోదరుల సహకారం ఎంతో గొప్పదని పేర్కొన్నారు.

సమ్మేళనంలో పలువురు నాయ కులు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యల పరిష్కారానికి తాను సిద్ధంగా ఉన్నానని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి హామీ ఇచ్చారు. సమస్యలకు సంబంధించిన వివరాలతో ఈ నెల 23వ తేదీ సాయంత్రం తనను కలిసి రిప్రజెంటేషన్ అందిస్తే, వాటిని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. నెల్లూరు ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తో కలిసి ముగ్గురు ప్రజాప్రతినిధులం సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ మాదిగ సోదరులు ఇదే ఆదరాభిమానాలను కొనసాగిస్తూ కూటమి అభ్యర్థులను ఆశీర్వదించాలని వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కోరారు.

## క్రైం న్యూస్

### గణేష్ ఉత్సవంలో ఇద్దరు వ్యక్తులు ఘర్షణ: ఒకరికి గాయాలు



గూడూరు( సింధూర దర్శిని) 17 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా ; గణేష్ ఉత్సవ ఊరేగింపులో ఇద్దరు వ్యక్తులు ఘర్షణలో ఒకరికి గాయాలు. పోలీసుల సమాచారం మేరకు సైదాపురం లోని బస్ స్టాండ్ సమీపంలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద గణేష్ విగ్రహం ఏర్పాటు చేసిన ప్రదేశంలో బుధవారం రాత్రి పలవారి వెంకీ ( 23) కులం బలిజ మరియు దేగ మహేష్ అనే ఇద్దరు యువకులు నిమర్జనం సందర్భంగా డ్యాన్స్ చేస్తుండగా, దేగ మహేష్ కాలు పలవారి వెంకీ కాలు పొరపాటున తొక్కినట్లు సమాచారం. ఈ విషయమై దేగ మహేష్‌ను పలవారి వెంకీ ప్రశ్నించగా, "నా కాలు తొక్కుతావా" అంటూ కోపంతో పలవారి వెంకీ , దేగ మహేష్ పొట్ట భాగంలో గుర్తుతెలియని పదునైన వస్తువుతో పొడిచి దాడి చేసినట్లు సమాచారం. ఈ ఘటనలో పలవారి వెంకీకి పొట్ట భాగంలో సుమారు 2 అంగుళాల గాయం అయినట్లు తెలిసింది. అంతట సదరు మహేష్ చికిత్స నిమిత్తం గూడూరు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకుంటున్నట్లు సమాచారం. దేగ మహేష్ ఏ వస్తువుతో దాడి చేశాడనే విషయం ఇంకా నిర్ధారణ కావాల్సి ఉంది అని ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు విచారణలో తెలియాల్సి ఉంది అని గతంలో ఈ వెంకీ అనే అబ్బాయి సైదాపురం పోలీస్ స్టేషన్ లో పలు కేసుల్లో ముద్దాయి గా ఉన్నాడు అని, గురువారం సాయంత్రం తిప్పరపాడు జంక్షన్ లో ముద్దాయి ని అదుపులోకి తీసుకోవడం జరిగింది అని తెలియజేశారు.



# పోలవరం ప్రాజెక్ట్ వద్ద ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలు

ఆశీర్వాద దీపం' కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు

పోలవరం, సింధూరదర్శిని: ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా పోలవరం ప్రాజెక్ట్ వద్ద జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులతో పాటు పోలవరం ప్రాజెక్ట్ వద్ద పనిచేస్తున్న ఇంజనీర్లు, అధికారులు, సిబ్బందితో కలిసి 'ఆశీర్వాద దీపం' కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ.. పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం రాష్ట్రానికి, దేశానికి అత్యంత కీలకమైనదని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో, ప్రధాని నరేంద్ర మోదీ మరియు కేంద్ర ప్రభుత్వ సహకారంతో పోలవరం ప్రాజెక్ట్ పనులు వేగంగా ముందుకు సాగుతున్నాయని చెప్పారు. గత పాలకుల హయాంలో పోలవరం ప్రాజెక్ట్ పూర్తవుతుందో లేదో అనే ప్రశ్నార్థక పరిస్థితులు నెలకొన్నాయని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ప్రాజెక్ట్ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ అందిస్తున్న సహకారం, కేంద్ర ప్రభుత్వం కల్పిస్తున్న నిధులు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరంతర పర్యవేక్షణతో పోలవరం పనుల్లో వేగం పెరిగిందని మంత్రి అన్నారు. 2027 నాటికి పోలవరం ప్రాజెక్ట్‌ను పూర్తి చేసి జాతికి అంకితం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పోలవరం ప్రాజెక్ట్ వద్ద జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. దేశాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని పోలవరం ప్రాజెక్ట్ వద్ద నిర్వహించిన 'ఆశీర్వాద దీపం' కార్యక్రమంలో ప్రార్థిస్తున్నామని మంత్రి తెలిపారు. ఆయన నాయకత్వంలో భారతదేశం మరింత శక్తివంతమైన, అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలని ఆకాంక్షించారు. 2047 నాటికి 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని సాధించాలనే ప్రధాని నరేంద్ర మోదీ ఆలోచనలకు అనుగుణంగా దేశం మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని మంత్రి నిమ్మల రామానాయుడు ఆకాంక్షించారు.



# రోగి భద్రతలో ఏపీ ఫస్ట్

ఆసుపత్రుల్లో నాణ్యత ప్రమాణాల పాటింపులో 86 స్కోరుతో రాష్ట్రానికి ప్రథమ స్థానం

ఢిల్లీలో గురువారం జరిగిన ప్రపంచ రోగి భద్రత దినోత్సవ కార్యక్రమంలో కేంద్రం వెల్లడి

అధికారులను అభినందించిన మంత్రి సత్యకుమార్ యాదవ్

ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని మంత్రి ఆకాంక్ష



అమరావతి సింధూరదర్శిని:
రోగి భద్రతలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. 86 స్కోరు సాధించి జాతీయ స్థాయిలో అత్యధిక సగటు మార్కులతో అగ్రస్థానంలో నిలిచింది. ప్రపంచ రోగి భద్రతా దినోత్సవం సందర్భంగా న్యూఢిల్లీలో గురువారం జరిగిన జాతీయ స్థాయి కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం వెల్లడించిన వివరాల్లో ఈ విషయం ప్రకటించింది. రాష్ట్రంలో రోగులకు సురక్షితమైన, నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలకు ఇది గుర్తింపుగా నిలిచింది.

### రాష్ట్రాల వారీగా స్కోర్లు

టాప్ ఫైవ్ రాష్ట్రాల్లో..ఆంధ్రప్రదేశ్ 86, మధ్యప్రదేశ్ 84.5, గుజరాత్ 83.5, దాద్రా-నగర్ హవేలీ, డామన్-డయ్యూ 83, తమిళనాడు 82 స్కోర్లు సాధించాయి.

### దిగువ ఐదు రాష్ట్రాల్లో..

బిహార్ 61, అండమాన్--నికోబార్ దీవులు 49.5, హర్యానా 47, హిమాచల్‌ప్రదేశ్ 35, అరుణాచల్‌ప్రదేశ్ 25 స్కోర్లు సాధించాయి.

### 62 ఆసుపత్రుల్లో వంద శాతం తనిఖీలు

రాష్ట్రంలో లక్ష్యంగా ఉన్న 53 ఏరియా ఆసుపత్రులు, 9 జిల్లా ఆసుపత్రులు.. మొత్తం 62 ఆసుపత్రుల్లో 100 శాతం రోగి భద్రతా తనిఖీలు పూర్తయ్యాయి. రోగి భద్రతా స్వీయ మదింపు విధానం ద్వారా ఈ తనిఖీలు నిర్వహించారు. జిల్లా నాణ్యతా బృందాలు, రాష్ట్ర నాణ్యతా విభాగం నివేదికలను సమీక్షించి సమగ్ర నివేదికను ఆగస్టు 10న జాతీయ ఆరోగ్య వ్యవస్థ వనరుల కేంద్రానికి సమర్పించాయి.

### నాణ్యతా ప్రమాణాల్లోనూ పురోగతి

ప్రభుత్వ వైద్య సంస్థల్లో ఎన్‌క్యూఏఎస్ (జాతీయ నాణ్యత హామీ పథకం) అమలులోనూ రాష్ట్రం గణనీయమైన పురోగతి సాధించింది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు, రోగి భద్రత, పరిశుభ్రత, రోగి కేంద్రిత సేవలు తదితర అంశాల్లో నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలను పాటిస్తున్న తీరును ఎన్‌క్యూఏఎస్ ద్వారా అంచనా వేస్తారు. రాష్ట్రంలో ఎన్‌క్యూఏఎస్ ధ్రువీకరణ 65 శాతానికి చేరింది. రోగి భద్రత, నాణ్యమైన వైద్యం, రోగి కేంద్రిత సేవలను మరింత బలోపేతం చేసే చర్యలు కొనసాగుతున్నాయి.

### జాతీయ వేదికపై ఏపీ పురోగతి

ప్రపంచ రోగి భద్రతా దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, జాతీయ ఆరోగ్య మిషన్ ఆధ్వర్యంలో, జాతీయ ఆరోగ్య వ్యవస్థ వనరుల కేంద్రం (ఎన్‌హెచ్‌ఎస్‌ఆర్‌సీ), న్యూఢిల్లీ సహకారంతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. 'అసాంక్రమిక వ్యాధులకు సురక్షితమైన వైద్య సంరక్షణ' అనే అంశంపై గురువారం న్యూఢిల్లీలోని ఎన్ఐహెచ్‌ఎఫ్‌డబ్ల్యూ ఆడిటోరియంలో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యక్రమం జరిగింది. అసాంక్రమిక వ్యాధుల గుర్తింపు, చికిత్స, మందుల వినియోగం, తదుపరి పరీక్షలు, పర్యవేక్షణలో రోగి భద్రతకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి, జాతీయ ఆరోగ్య మిషన్ మిషన్ డైరెక్టర్ ఆరాధనా పట్నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సిబిన్ సి. గౌరవ అతిథిగా, ఎన్‌హెచ్‌ఎస్‌ఆర్‌సీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ (డాక్టర్)ప్రగ్యాశర్మ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్య, రాష్ట్ర కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్, జాతీయ ఆరోగ్య మిషన్ ఎండీ శ్రీ కె.వి.ఎన్. చక్రధర్‌బాబు, ఆంధ్రప్రదేశ్‌లో ఎన్‌క్యూఏఎస్ అమలు, నాణ్యతా ప్రమాణాల పురోగతిని వర్చువల్‌గా వివరించారు. రాష్ట్రంలో ఎన్‌క్యూఏఎస్ ధ్రువీకరణ 65 శాతానికి చేరిన విషయాన్ని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి రాష్ట్ర సమన్వయకర్త శ్రీమతి నాగలక్ష్మి కార్యక్రమానికి నేరుగా హాజరయ్యారు. రోగులకు సురక్షితమైన వైద్య సేవలు అందించేందుకు అనుసరించాల్సిన విధానాలు, అసాంక్రమిక వ్యాధుల నియంత్రణలో భద్రతా ప్రమాణాలపై జరిగిన చర్చల్లో ఆమె పాల్గొన్నారు.

### సమష్టి కృషితో జాతీయ గుర్తింపు

రాష్ట్ర నాణ్యతా విభాగం, జిల్లా నాణ్యతా బృందాలు, ఆసుపత్రులు, వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేయడం వల్ల ఈ పురోగతి సాధ్యమైంది. రోగి భద్రతను ప్రభుత్వ వైద్యసంస్థల్లో నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తూ నాణ్యతా ప్రమాణాలను మరింత పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ సందర్భంగా వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ రాష్ట్రానికి జాతీయ స్థాయిలో ప్రథమ స్థానం రావడంపై అధికారులు, వైద్య సిబ్బందిని అభినందించారు. రోగి భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ, సాధించిన ప్రమాణాలను మరింత మెరుగుపరిచేందుకు కృషి చేయాలని సూచించారు.

# ఫెడ్ ఎఫెక్ట్.. మిశ్రమంగా ముగిసిన స్టాక్ మార్కెట్ సూచీలు

21.86 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్

53 పాయింట్లు లాభపడిన నిఫ్టీ

బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి

ఫెడ్ నిర్ణయం తర్వాత రూపాయిపై ఒత్తిడి ఉండొచ్చన్న నిపుణులు

అమెరికా ఫెడరల్ రిజర్వ్ నిర్ణయాలపై ఇన్వెస్టర్లు దృష్టి పెట్టడంతో దేశీయ స్టాక్‌మార్కెట్లు గురువారం మిశ్రమంగా ముగిశాయి. సెన్సెక్స్ 21.86 పాయింట్లు నష్టపోయి 74,314.59 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 53 పాయింట్లు లాభపడి 23,270.60 వద్ద ముగిసింది.

నిఫ్టీ 23,300స్థాయి వద్ద కీలక నిరోధాన్ని ఎదుర్కొంటోందని మార్కెట్ నిపుణులు తెలిపారు. ఈ స్థాయిని దాటితే 23,500 వరకు నిఫ్టీ పుంజుకునే అవకాశం ఉందన్నారు. 23,200 నుంచి 23,000 స్థాయిల వద్ద మద్దతు లభించవచ్చని పేర్కొన్నారు. కొన్ని బడా కంపెనీల షేర్లలో కొనుగోళ్లు కనిపించాయి. టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ షేర్లు నిఫ్టీలో భారీగా లాభపడ్డాయి. విస్తృత మార్కెట్లు మాత్రం బెంచ్‌మార్క్ సూచీలను మించి రాణించాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 0.92 శాతం పెరిగింది. నిఫ్టీ స్మాల్‌క్యాప్ 0.76 శాతం లాభపడింది. రియల్టీ, ఆటో, మెటల్ రంగాల షేర్లలో కొనుగోళ్లు జోరుగా సాగాయి. మరోవైపు బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. నిఫ్టీ బ్యాంక్, నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్, నిఫ్టీ ప్రైవేట్ బ్యాంక్ సూచీలు నష్టపోయాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ విధాన నిర్ణయం ప్రభావాన్ని ఇన్వెస్టర్లు అంచనా వేయడంతో మార్కెట్లు ఒక పరిమిత శ్రేణిలో కదిలాయని నిపుణులు తెలిపారు. అదే సమయంలో వివిధ రంగాల షేర్లలో కదలికలు మార్కెట్ గమనాన్ని ప్రభావితం చేశాయని చెప్పారు. మరోవైపు అమెరికా ఫెడ్ నిర్ణయం తర్వాత రూపాయి మరింత ఒత్తిడికి లోనయ్యే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేశారు. డాలర్‌తో రూపాయి విలువ 96స్థాయిని దాటే అవకాశం ఉందన్నారు. డాలర్-రూపాయి మారకంలో 96.25 వద్ద తక్షణ నిరోధం ఉందని, 95.40-95.75 మధ్య మద్దతు లభించవచ్చని విశ్లేషించారు.



# మనకు మనమే శత్రువులం..

**అవును, 100 శాతం వాస్తవం: శోభిత ధూళిపాళ**

**మన ఎదుగుదలకు మనమే అడ్డుపడతామన్న శోభిత**

**తెలుగు ఇన్ఫ్లుయెన్సర్ పోస్ట్‌కు మద్దతు తెలిపిన నటి**

**16 ఏళ్ల వయసులో ముంబై వెళ్లినప్పుడు ఎవరూ ప్రోత్సహించలేదని వెల్లడి**

**ఆడవాళ్లు కొత్తగా ప్రయత్నిస్తే ఇబ్బందులు ఇంకా ఎక్కువని వ్యాఖ్య**

**ఒకరికొకరు మద్దతిచ్చుకోవాలని, మానసికంగా దృఢంగా ఉండాలని సూచన**



సమాజంలో ఒకరి ఎదుగుదలను మరొకరు ప్రోత్సహించరని, మనకు మనమే శత్రువులమని ప్రముఖ నటి శోభిత ధూళిపాళ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఒక తెలుగు ఇన్‌ఫ్లుయెన్సర్ సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్‌కు మద్దతు తెలుపుతూ ఆమె తన అభిప్రాయాలను పంచుకున్నారు. "ఒకరి ఎదుగుదలను మనవాళ్లే ప్రోత్సహించరు" అనే ఆ పోస్ట్‌కు బదులిస్తూ "100 శాతం వాస్తవం" అని ఆమె స్పందించారు. ఈ సందర్భంగా తన కెరీర్ ప్రారంభంలో ఎదుర్కొన్న అనుభవాలను శోభిత గుర్తుచేసుకున్నారు. కేవలం 16 ఏళ్ల వయసులోనే ఎటువంటి భరోసా లేకుండా ముంబైకి వెళ్లానని, రిస్క్ తీసుకుని ముందడుగు వేశానని తెలిపారు. కొత్త దారుల్లో ప్రయాణించే వారిని, పెద్ద కలలు కనే వారిని ఈ సమాజం పెద్దగా ప్రోత్సహించదని తాను గమనించినట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా, ఒక రంగంలోకి కొత్తగా అడుగుపెట్టేవారికి అప్పటికే అక్కడ స్థిరపడిన వారు అరుదుగా మద్దతు ఇస్తారని, అదే మహిళల విషయానికొస్తే సవాళ్లు మరింత ఎక్కువగా ఉంటాయని ఆమె అభిప్రాయపడ్డారు. అయితే, ఈ వ్యాఖ్యలు తాను కెరీర్ ప్రారంభించిన నాటి పరిస్థితులకు సంబంధించినవని, ఇప్పుడు పరిస్థితులు మారి ఉంటాయని ఆశిస్తున్నట్లు శోభిత స్పష్టం చేశారు. సమాజంలో ఒకరికొకరు మద్దతుగా నిలవాలని, ఇతరులపై ఆధారపడకుండా సొంతంగా ఎదిగేందుకు అవసరమైన మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలని ఆమె సూచించారు. 'గూఢచారి', 'మేజర్', 'పొన్నియిన్ సెల్వన్' వంటి చిత్రాలతో గుర్తింపు పొందిన శోభిత చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# ఏపీ మద్యం రవాణా కుంభకోణం..

**మాజీ మంత్రి కారుమూరి రిమాండ్ పొడిగింపు**

**కారుమూరిని విజయవాడ ప్రత్యేక కోర్టుకు తీసుకొచ్చిన ఈడీ అధికారులు**

**హవాలా మార్గంలో రూ. 15కోట్లు కారుమూరికి చేరినట్లు ఆధారాలు**

**ఇప్పటివరకు ఆయన కుటుంబానికి చెందిన రూ. 87.7 కోట్ల ఆస్తుల జప్తు**



విజయవాడ సింధూరదర్శిని: మద్యం రవాణా స్కామ్ కేసులో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు నిందితుడిగా ఉన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న ఆయనను... ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు పీటీ వారెంట్‌పై విజయవాడ ప్రత్యేక కోర్టుకు తీసుకువచ్చారు. విచారణ అనంతరం ఆయన రిమాండ్ ను న్యాయస్థానం సెప్టెంబరు 25 వరకు పొడిగించింది. ఈ కేసు విషయానికొస్తే... (ఈడీ నివేదిక ప్రకారం) సాధారణ నిబంధనల మేరకు కిలోమీటర్‌కు రూ. 13 మాత్రమే రవాణా ఛార్జీలుగా చెల్లించాల్సి ఉండగా, టెండర్ల నిబంధనలను అక్రమంగా సవరించి కిలోమీటర్‌కు ఏకంగా రూ. 35 వరకు చెల్లించారు. ఈ అక్రమ మార్పుల కారణంగా ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ. 195.33 కోట్ల మేర భారీ నష్టం వాటిల్లినట్లు దర్యాప్తు సంస్థ ప్రాథమికంగా లెక్కగట్టింది. కారుమూరి నాగేశ్వరరావు పౌరసరఫరాల శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న సమయంలో తన అధికారిక హోదాను దుర్వినియోగం చేస్తూ తన కుమారుడు, వ్యాపార భాగస్వాములకు మద్యం రవాణా సబ్‌కాంట్రాక్టులు దక్కేలా చక్రం తిప్పారని దర్యాప్తులో నిర్ధారణ అయింది. ఈ వ్యవహారంలో హవాలా మార్గంలో దాదాపు రూ. 15 కోట్లు కారుమూరికి చేరినట్లు ఆధారాలు సేకరించిన అధికారులు, ఇప్పటివరకు ఆయన కుటుంబానికి చెందిన రూ. 87.7 కోట్ల విలువైన ఆస్తులను తాత్కాలికంగా జప్తు చేశారు. ఈ కేసులో ఇప్పటికే కారుమూరి కుమారుడు సునీల్ కుమార్, ఏపీఎస్‌బీసీఎల్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డి, డిజిటల్ నెట్‌వర్క్స్ అధినేత కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డిలను ఈడీ అరెస్ట్ చేసి విచారిస్తోంది.

## ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు

ఒంగోలు సింధూరదర్శిని: ప్రకాశం జిల్లా బిసి సంక్షేమ, సాధికారత అధికారిని ఎస్. నిర్మల జ్యోతి ఆధ్వర్యంలో గురువారం శ్రీశ్రీశ్రీ మహారాజశ్రీ విశ్వకర్మ జయంతోత్సవ వేడుకలు ప్రకాశం భవనంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు పాల్గొని చిత్ర పటానికి పూల దండలు వేసి ఘన నివాళుర్పించారు. అనంతరం విశ్వకర్మ జీవిత విశేషాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కందుకూరు సబ్ కలెక్టర్ డి.హిమ వంశి, జిల్లా రెవెన్యూ అధికారి వెంకట రమణ, పి.సాయిబాబు, పి.బాలసుబ్రమణ్యం, జి. బ్రహ్మానందశర్మ, కె.శ్రీనివాస్, సహాయసంక్షేమ అధికారులు సి.హెచ్. వెంకట్రావు, షేక్. జబ్బార్ కందుకూరు, జిల్లా బి.సి. ప్రధానకార్యాలయం సిబ్బంది, బిసి వసతి గృహ సంక్షేమ అధికారులు, నాల్గవ తరగతి సిబ్బంది పాల్గొన్నారు.





# విశ్వబ్రాహ్మణుల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

**విశ్వబ్రాహ్మణుల సంక్షేమం, ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట**

**త్వరలో 'ఆదరణ-3' పునఃప్రారంభం**

**ఆధునిక పనిముట్ల పంపిణీ**

**వృత్తిదారులకు 50 ఏళ్లకే పింఛను అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం**

**విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కమ్మరి పార్వతి**



విజయవాడ సింధూరదర్శిని: రాష్ట్రంలోని విశ్వ బ్రాహ్మణుల సంక్షేమం, సమగ్ర ఆర్థికాభివృద్ధికి కూటమి ప్రభుత్వం పూర్తి నిబద్ధతతో పనిచేస్తోందని ఆంధ్రప్రదేశ్ విశ్వ బ్రాహ్మణ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ కమ్మరి పార్వతి తెలిపారు. స్థానిక తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రములో గురువారం వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దేవశిల్పి విరాట్ విశ్వకర్మ భగవాన్ రాష్ట్రస్థాయి జయంతోత్స వము నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ విశ్వ బ్రాహ్మణ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ కమ్మరి పార్వతి హాజరై మాట్లాడుతూ కులవృత్తులపై ఆధారపడి జీవిస్తున్న విశ్వ బ్రాహ్మణులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం త్వరలోనే 'ఆదరణ-3' పథకాన్ని పునఃప్రారంభించి ఆధునిక పనిముట్లను అందించనుందన్నారు. సంప్రదాయ వృత్తిదారులకు ఆధునిక సాంకేతిక పరికరాలు అందుబాటులోకి రావడం ద్వారా వారి వృత్తి సామర్థ్యం, ఆదాయ అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. విశ్వబ్రాహ్మణ వృత్తిదారులకు 50 ఏళ్లకే పింఛను మంజూరు చేయాలన్న అంశాన్ని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఈ అంశంపై ప్రభుత్వం నుంచి సానుకూల నిర్ణయం వెలువడేలా చర్యలు తీసుకుంటుందన్న ఆశాభావం వ్యక్తపరచారు. విశ్వ బ్రాహ్మణులసంక్షేమం, అభివృద్ధి కోసం చేపడుతున్న కార్యక్రమాలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మానవ వనరులు, ఐటీ శాఖ మంత్రి శ్రీ నారా లోకేశ్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి ఎస్. సవితలు సంపూర్ణ సహకారం అందిస్తున్నారన్నారు. వారి సహకారంతో విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి మరిన్ని కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో 25 లక్షలకు పైగా ఉన్న విశ్వ బ్రాహ్మణులు విడివిడిగా కాకుండా ఏకీకృతంగా సంఘటితమై ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

సమాజం ఏకతాటిపైకి వచ్చినప్పుడే తమ సమస్యలను సమర్థవంతంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, తగిన గుర్తింపు మరియు చట్టసభల్లో ప్రాతినిధ్యం సాధించే అవకాశాలు మెరుగుపడతాయని ఆమె పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో విశ్వబ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కార్పొరేషన్ పాలకమండలి డైరెక్టర్లు నిరంతరం అందుబాటులో ఉంటారని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని చైర్‌పర్సన్ కమ్మరి పార్వతి తెలియజేశారు. విజయవాడ తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ.. విశ్వ సృష్టికి మూలకారకులు, సాంకేతికతకు మార్గదర్శకులు దేవశిల్పి విరాట్ విశ్వకర్మ భగవాన్ అని పేర్కొన్నారు. సృష్టి నిర్మాణంలోనూ, భారతీయసంస్కృతి-సంప్రదాయాలలోనూ విశ్వకర్మల పాత్ర అత్యంత ప్రాధాన్యమైనదన్నారు. భారతదేశ మూల సంతతికి ఆదిపురుషులు విశ్వకర్మలే అని వాస్తు, శిల్పకళలకు శాస్త్రీయ దృక్పథాన్ని జోడించి నాగరికతకు ప్రాణం పోసిన ఘనత వీరిదన్నారు. శతాబ్దాల క్రితమే కాలజ్ఞానంలో ఆకాశంలో ఇనుప పక్షులు ఎగురుతాయని చెప్పిన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి గారి మాటలు నేటి విమానాలు, ఆధునిక డ్రోన్ టెక్నాలజీల రూపంలో నిజమయ్యాయన్నారు. గత 25 సంవత్సరాలుగా విజయవాడలో ప్రజాప్రతినిధిగా ఉన్న నాకు, విశ్వబ్రాహ్మణుల సేవలను నిరంతరం దగ్గరుండి చూసే భాగ్యం కలిగిందనారు. సంపాదించిన దాంట్లో పేదలకు సాయం చేస్తూ 'మానవ సేవే మాధవ సేవ' అనే భావనతో సమాజ హితానికి కృషి చేసే నిస్వార్థ గుణం విశ్వబ్రాహ్మణుల సొంతం అన్నారు. కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి, పేదరిక నిర్మూలనకు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు.

రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఎక్స్-అఫిషియో సెక్రటరీ టు గవర్నమెంట్ ఎస్. సత్యనారాయణ మాట్లాడుతూ.. విశ్వకర్మ వంశీయులైన స్వర్ణకారులు, వడ్రంగులు, కాంస్యకారులు, కమ్మరులు, శిల్పకారులు సంప్రదాయ వృత్తులతో సమాజ అభివృద్ధికి కీలకంగా నిలిచారని అన్నారు. ఆధునిక కాలంలో ఈ వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్‌తో పాటు ప్రత్యేకంగా స్వర్ణకారుల అభివృద్ధి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎ. మల్లికార్జున మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని విశ్వబ్రాహ్మణులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సంప్రదాయ వృత్తులకు ఆధునిక సాంకేతికతను జోడించి ఆర్థికంగా ఎదగాలని, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'పీఎం విశ్వకర్మ' పథకాన్ని కూడా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కుమ్మరి శాలివాహన చైర్మన్ పేరేపి ఈశ్వర్, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సింహాద్రి కనకాచారి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ (జీవీణ), ఆంధ్రప్రదేశ్ బీసీ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ భీమశంకర్, బీసీ సంక్షేమ శాఖ అడిషనల్ డైరెక్టర్ చంద్రశేఖర్ రాజు, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ గౌరవ డైరెక్టర్లు, ఇతర బోర్డు సభ్యులు పాల్గొన్నారు. ముందుగా దేవశిల్పి విరాట్ విశ్వకర్మ భగవాన్ చిత్రపటానికి ముందుగా అతిథులందరూ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

# నిద్రపోతే రూ.13.7లక్షలు.. జపాన్‌లో భలే వింత పోటీ!

**అక్టోబర్ 5న టోక్యోలో పోటీ**

**ఒక్కొక్కరికి 90 నిమిషాల నిద్ర సమయం**

**గాఢ నిద్ర, స్థిరత్వాన్ని ప్రత్యేక పరికరాలతో పరిశీలన**

**నిద్ర మాత్రలు, ముందు రోజు మేల్కొని ఉండడం కుదరదు**

**నాణ్యమైన నిద్రపై అవగాహన కల్పించడమే లక్ష్యం**



నిద్రపోవడమంటే విశ్రాంతి తీసుకోవడమే అనుకుంటాం. కానీ జపాన్‌లో మాత్రం నిద్రపోతే ఏకంగా లక్షలు గెలుచుకునే అవకాశం వచ్చింది. ఒక జపాన్ మ్యాట్రెస్ కంపెనీ నిద్రపై ప్రత్యేక పోటీ నిర్వహించనుంది. ఇందులో ఎవరు అత్యుత్తమంగా నిద్రపోతారో తేల్చి.. విజేతకు 22.2 లక్షల యెన్‌లు, అంటే భారత కరెన్సీలో సుమారు రూ.13.76లక్షలు బహుమతిగా ఇవ్వనున్నారు. అక్టోబర్ 5న టోక్యోలోని షేర్ గ్రీన్ మినామి అయోమాలో ఈ పోటీ జరగనుంది. పోటీలో పాల్గొనేవారికి 90 నిమిషాల సమయం ఇస్తారు. ఆ సమయంలో వారు ఎంత త్వరగా నిద్రలోకి జారుకున్నారు? ఎంత గాఢంగా నిద్రపోయారు? నిద్ర ఎంత స్థిరంగా కొనసాగింది? వంటి అంశాలను ప్రత్యేక పరికరాలతో నిర్వాహకులు పరిశీలిస్తారు. అయితే పోటీకి ముందు కంటెస్టెంట్లకు కొన్ని వ్యాయామాలు చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత ప్రతి ఒక్కరికీ దిండు, దుప్పటి, కంటి ముసుగు లాంటి ఏదో ఒక నిద్ర వస్తువు కేటాయిస్తారు. పోటీ కోసం ముందుగానే రాత్రంతా మేల్కొని ఉండటం, కావాలనే నిద్రకు దూరంగా ఉండటం వంటి వాటికి అనుమతి లేదు. సహజంగా వచ్చే నిద్రనే పరీక్షించాలన్నది నిర్వాహకుల ఉద్దేశం. నిద్ర పట్టేందుకు నిద్రమాత్రలు లేదా ఇతర మందులు వాడటంపైనా నిషేధం ఉంది. పోటీ సమయంలో నిర్వాహకులు కావాలనే కొన్ని అనూహ్యమైన అంతరాయాలు కలిగించే అవకాశం కూడా ఉంది. వాటి మధ్య కూడా నిద్రను ఎంత స్థిరంగా కొనసాగిస్తారన్నది పరిశీలించనున్నారు. ప్రధాన విజేతతో పాటు ప్రత్యేక ప్రతిభ కనబరిచిన వారికి కూడా బహుమతులు అందించనున్నారు. గాఢ నిద్రలోకి జారుకున్న వారికి 'డీప్ స్లీప్ డైవ్ అవార్డు', చిత్రమైన భంగిమలో నిద్రపోయిన వారికి మరో ప్రత్యేక బహుమతి ఇవ్వనున్నారు. పోటీకి దరఖాస్తు చేసుకోవడం ఉచితం. సెప్టెంబర్ 16 వరకు దరఖాస్తులు స్వీకరించారు. మూడు విడతల్లో పోటీ నిర్వహించి, ఒక్కో విడతలో సుమారు 20 మంది పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నారు. జపాన్‌లో పెరుగుతున్న నిద్రలేమి సమస్యపై అవగాహన కల్పించడంతో పాటు నాణ్యమైన విశ్రాంతి ప్రాధాన్యాన్ని చాటడమే ఈ పోటీ ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

# మంత్రాలయంలో ఉపాసన కొణిదెల ప్రత్యేక పూజలు

**మంత్రాలయం రాఘవేంద్ర స్వామి వారి బృందావనాన్ని దర్శించుకున్న ఉపాసన**

**స్థానిక గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్న ఉపాసన**

**ఉపాసనను చూసేందుకు పెద్ద సంఖ్యలో వచ్చిన చరణ్ అభిమానులు**



కర్నూలు సింధూరదర్శిని: జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మంత్రాలయంలో టాలీవుడ్ గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ భార్య ఉపాసన కొణిదెల పర్యటించారు. ఉదయాన్నే ప్రత్యేక హెలికాప్టర్‌లో మంత్రాలయానికి చేరుకున్న ఆమెకు రాఘవేంద్ర స్వామివారి ఆలయ అధికారులు, పీఠం ప్రతినిధులు ఘనస్వాగతం పలికారు. మంత్రాలయం పర్యటనలో భాగంగా ఉపాసన ముందుగా స్థానిక గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం శ్రీ రాఘవేంద్ర స్వామివారి మూల బృందావనాన్ని సందర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మఠాధిపతి శ్రీ సుబుధేంద్ర తీర్థ స్వామిని దర్శించుకోగా, ఆయన ఉపాసనకు మంత్రాలయం విశేష శేషవస్త్రం, తీర్థప్రసాదాలు అందజేసి వేదాశీర్వచనం అందించారు. రాఘవేంద్ర స్వామి దివ్య ఆశీస్సులు పొందడం ఎంతో ఆనందంగా, ప్రశాంతంగా ఉందని ఈ సందర్భంగా ఆమె హర్షం వ్యక్తం చేశారు. మరోవైపు, తమ అభిమాన కథానాయకుడు చరణ్ భార్య మంత్రాలయానికి వచ్చారన్న సమాచారం వ్యాపించడంతో... ఆమెను చూసేందుకు అభిమానులు, స్థానిక భక్తులు ఆలయ ప్రాంగణానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో మంత్రాలయం మఠ పరిసర ప్రాంతాల్లో సందడి వాతావరణం నెలకొంది.

# పాడైన మాంసం.. అపరిశుభ్ర వంటగది





**కుంభకర్ణ రెస్టారెంట్ వంటగది తాత్కాలిక మూసివేత**

**ఐపీఎం డైరెక్టర్ అరుణ్‌బాబు స్వయంగా తనిఖీ.. 6 కిలోల పాడైన ఆహారం ధ్వంసం**

మంగళగిరి సింధూరదర్శిని: ఫ్రీజర్‌లో పాడైన చికెన్, మటన్, తందూరీ చికెన్, కబాబ్‌లు నిల్వ ఉంచడం.. మాంసం, చికెన్ రక్తపు మరకలతో వంటగది అపరిశుభ్రంగా ఉండటం వంటి తీవ్ర లోపాలు బయటపడటంతో మంగళగిరి కాజా టోల్‌ప్లాజా సమీపంలోని కుంభకర్ణ మల్టీ క్యూజీన్ ఫ్యామిలీ రెస్టారెంట్ వంటగదిని అధికారులు తాత్కాలికంగా మూసి వేయించారు ఐపీఎం(ఫుడ్ సేఫ్టీ డిపార్ట్మెంట్)డైరెక్టర్ అరుణ్‌బాబు బుధవారం సాయంత్రం స్వయంగా తనిఖీ చేసి పరిస్థితులను పరిశీలించారు. ఆయనతో పాటు సహాయ ఆహార నియంత్రణ అధికారి ఎన్.పూర్ణచంద్రరావు, ఆహార భద్రత అధికారులు బి.నరసింహుడు, ఎన్.వెంకటేశ్వర్లు తనిఖీలో పాల్గొన్నారు. అనంతరం వంటగది కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేస్తూ అధికారులు నోటీసు జారీ చేశారు. ఈ మేరకు అరుణ్ బాబు బుధవారం రాత్రి ఓ ప్రకటన జారీ చేశారు. తనిఖీలో ఫ్రీజర్‌లో పాడైన ముడి బోన్‌లెస్ చికెన్ 500 గ్రాములు, వండిన చికెన్ కూర 500 గ్రాములు, వండిన మటన్ 500 గ్రాములు, తందూరీ చికెన్ 2.5 కిలోలు, చికెన్ తంగ్డీ కబాబ్ 1.5 కిలోలు, ఆటా పిండి 500 గ్రాములు ఉన్నట్లు గుర్తించారు. మొత్తం 6 కిలోల ఆహార పదార్థాలను అక్కడికక్కడే ధ్వంసం చేశారు. తనిఖీలో గడువు ముగిసిన స్కిమ్డ్ మిల్క్ డెయిరీ వైటెనర్ పౌడర్ 3 కిలోలు, కంపౌండెడ్ ఇంగువ పొడి 600 గ్రాములు, పన్నీర్ చీజ్ అనలాగ్ 1 కిలో కూడా గుర్తించారు. సంబంధిత పదార్థాలను స్వాధీనం చేసుకుని తదుపరి పరీక్షలు, పరిశీలనకు చర్యలు చేపట్టారు. ఆహార నాణ్యతను నిర్ధారించేందుకు మొత్తం 13 నమూనాలు సేకరించారు. ఇందులో 3 చట్టపరమైన, 10 పర్యవేక్షణ నమూనాలు ఉన్నాయి. బెల్లం, కారం పొడి, ధనియాలతో పాటు శనగపప్పు, మామిడికాయ ఊరగాయ, కందిపప్పు, మస్టర్డ్ సాస్, స్వీట్ చిల్లీ సాస్, చిల్లీ పొడి, మటన్ మసాలా, పన్నీర్ చీజ్ అనలాగ్, చికెన్ మసాలా తదితర నమూనాలను పరీక్షలకు పంపారు. ఫ్రీజర్‌లో మాంసం, చికెన్ రక్తపు మరకలు, గోడలపై నూనె, పొగ మరకలు, వ్యర్థాలతో మురుగునీటి కాలువలు మూసుకుపోవడం, వంటగదిలో చెత్త పేరుకుపోవడం, ఆహార తయారీలో ఉపయోగించకూడని రంగుల పదార్థాలు, లేబుళ్లు లేని మసాలా పొడులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. లోపాలను వెంటనే సరిచేయాలని, పరిశుభ్రత, ఆహార నిల్వ, వ్యర్థాల తొలగింపు తదితర అంశాల్లో నిబంధనలు పాటించాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. లోపాలను సరిచేసినట్లు నివేదిక సమర్పించే వరకు వంటగది కార్యకలాపాలు నిలిపివేయాలని స్పష్టం చేశారు.

# యూపీఐ చెల్లింపులపై ఛార్జీలు.. మినహాయింపు కోరుతున్న పెట్రోల్ డీలర్లు

**యూపీఐ లావాదేవీలపై ఎండీఆర్ ఛార్జీల నుంచి మినహాయింపు కోరుతున్న పెట్రోల్ డీలర్లు**

**రూ.2000 దాటిన ప్రతి లావాదేవీపై రూ.5 ఎండీఆర్ విధింపుపై ఆందోళన**

**ఈ ఛార్జీలు తమ మార్జిన్లపై భారం మోపుతాయని డీలర్ల సంఘం ఆవేదన**

**డిజిటల్ మౌలిక వసతుల కోసమే ఎండీఆర్ అని వివరించిన పెట్రోలియం శాఖ**

**ప్రభుత్వంతో చర్చలు కొనసాగిస్తామని తెలిపిన ఏఐపీడీఏ**



పెట్రోల్ బంకుల్లో ఇంధనం అమ్మకాలపై యూపీఐ ద్వారా చేసే చెల్లింపులకు వర్తించే మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) నుంచి తమకు మినహాయింపు ఇవ్వాలని పెట్రోల్ డీలర్లు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ అంశంపై 'ఆల్ ఇండియా పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్' (ఏఐపీడీఏ) ప్రతినిధులు గురువారం కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారులతో సమావేశమై చర్చలు జరిపారు. కొత్త యూపీఐ నిబంధనల ప్రకారం, పెట్రోల్, డీజిల్ కొనుగోళ్లలో రూ.2,000 దాటిన ప్రతి లావాదేవీపై రూ.5 ఎండీఆర్ ఛార్జీ విధిస్తున్నారు. దేశవ్యాప్తంగా పెట్రోల్ బంకుల్లో జరిగే మొత్తం కొనుగోళ్లలో సుమారు 30 నుంచి 40 శాతం లావాదేవీలు ఈ పరిధిలోకి వస్తాయని డీలర్లు చెబుతున్నారు. పెట్రోల్ అమ్మకాలు నిర్దేశిత కమీషన్లపై ఆధారపడి జరుగుతాయని, ఈ అదనపు ఎండీఆర్ ఛార్జీల భారం తమ మార్జిన్లను దెబ్బతీస్తుందని డీలర్ల సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ సమావేశంలో మంత్రిత్వ శాఖ అధికారులు ఎండీఆర్ విధింపు వెనుక ఉన్న కారణాలను వివరించారు. దేశంలో యూపీఐ డిజిటల్ మౌలిక సదుపాయాల అభివృద్ధి, విస్తరణకు ఈ ఛార్జీలు అవసరమని వారు తెలిపారు. మరోవైపు, దేశవ్యాప్తంగా డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించడంలో తాము ముందు వరుసలో ఉన్నామని, ప్రభుత్వంతో కలిసి పనిచేశామని ఏఐపీడీఏ గుర్తుచేసింది. ఎండీఆర్ అనేది ప్రభుత్వం గానీ, ఎన్‌పీసీఐ గానీ వసూలు చేసే పన్ను కాదని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ గతంలోనే స్పష్టం చేసింది. యూపీఐ వ్యవస్థ నిర్వహణ, విస్తరణకు సహకరించేందుకు ఈ మొత్తాన్ని బ్యాంకులకు, పేమెంట్ అప్లికేషన్ ప్రొవైడర్లకు పంచుతారని తెలిపింది. ఇంధనం, రైల్వేలు, టెలికాం, బీమా, వ్యవసాయం వంటి తక్కువ మార్జిన్లు ఉండే కీలక రంగాల్లో రూ.2,000 దాటిన లావాదేవీలకు ఈ రూ.5 ఫ్లాట్ ఛార్జీని వర్తింపజేస్తున్నారు. ప్రభుత్వంతో చర్చలు కొనసాగిస్తామని, వినియోగదారులు, డీలర్లు, యూపీఐ భాగస్వాములు అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం లభిస్తుందని ఆశిస్తున్నామని ఏఐపీడీఏ ఒక ప్రకటనలో పేర్కొంది.




# 14 గంటల వెయిటింగ్..

**-గదులు లేవు, తిండి లేదు..**
**-ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్ల కష్టాలు!**
**-నాగోయాలో భారత అథ్లెట్లకు వసతి కష్టాలు**
**-కొందరికి ఆహారం కూడా అందుబాటులో లేక ఇబ్బందులు**
**-గదులు వచ్చిన వారిని ఇతరులతో సర్దుకోవాలని సూచన**
**-రోయర్లు, షూటర్లు సహా పలు బృందాలకు సమస్య**
**-ఇతర హోటళ్లకు కొందరు భారత సభ్యుల తరలింపు**
**-అథ్లెట్ల సంఖ్య అంచనాలో పొరపాటే కారణమని నివేదిక**

ఆసియా క్రీడల కోసం జపాన్‌లోని నాగోయాకు చేరుకున్న భారత అథ్లెట్లకు చేదు అనుభవం ఎదురైంది. అక్రిడిటేషన్లు ఉన్నప్పటికీ పలువురు క్రీడాకారులకు సకాలంలో వసతి గదులు కేటాయించలేదు. దీంతో 12 గంటలకు పైగా, కొందరు 14 గంటల వరకు గదుల కోసం వేచి చూడాల్సి వచ్చింది. ఈ సమయంలో ఆహారం కూడా అందుబాటులో లేకపోవడంతో అథ్లెట్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు 'ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పేర్కొంది. భారత రోయింగ్ బృందానికి చెందిన క్రీడాకారులు మంగళవారం ఢిల్లీ నుంచి రెండు బృందాలుగా జపాన్‌కు బయల్దేరారు. బ్యాంకాక్‌లో విరామం తర్వాత తొలి బృందం బుధవారం ఉదయం 8 గంటల సమయంలో నాగోయా చేరుకుంది. అక్కడి నుంచి గంట తర్వాత వసతి కోసం ఏర్పాటు చేసిన క్రూజ్ నౌక వద్దకు వెళ్లారు. అయితే గదులు సిద్ధంగా లేకపోవడంతో అక్కడే నిరీక్షించాల్సి వచ్చింది. ఓ రోయర్ 'ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్'తో మాట్లాడుతూ.. ఉదయం 9 గంటలకు వసతి కేంద్రానికి చేరుకున్నామని, రాత్రి 8.30 గంటల సమయానికి కొద్దిమందికే గదులు లభించాయని తెలిపారు. గదులు పొందిన వారిని కూడా మరికొందరు క్రీడాకారులతో కలిసి ఉండాలని కోరినట్లు చెప్పారు. రోయర్లే కాకుండా భారత షూటర్లు, మరో రెండు జట్లకు కూడా ఇదే పరిస్థితి ఎదురైనట్లు నివేదిక పేర్కొంది. షూటర్లకు కేటాయించిన వసతి కేంద్రాన్ని ఇతర దేశాల బృందాలకు ఇవ్వడంతో వారు మరో హోటల్‌లో బస చేయాల్సి వచ్చింది. భారత ఒలింపిక్ సంఘానికి చెందిన కొందరు సభ్యులను కూడా సమీపంలోని మరో హోటల్‌కు తరలించారు. వైద్య బృందం కూడా తాత్కాలికంగా వారితో కలిసి సర్దుకోవాల్సి వచ్చింది. క్రీడాకారులు, బృందాల సంఖ్యను నిర్వాహకులు సరిగా అంచనా వేయకపోవడం వల్లే ఈ సమస్య తలెత్తినట్లు నివేదిక పేర్కొంది. అందుబాటులో ఉన్న వసతిలో కొంత భాగాన్ని ఇతర దేశాల బృందాలకు కేటాయించడంతో భారత అథ్లెట్లకు గదుల కొరత ఏర్పడినట్లు తెలిపింది. ఆసియా క్రీడల ఆరంభానికి ముందే వసతి ఏర్పాట్లలో తలెత్తిన ఈ గందరగోళం భారత బృందాలకు ఇబ్బందికరంగా మారింది.

# 21న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

సిఎస్‌పురం, సింధూరదర్శిని: ఈ నెల 21వతేది సోమవారం ఉదయం 11గంటలకు మండల పరిషత్ అధ్యక్షుడు మూడమంచు వెంకటేశ్వర్లు అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ యం.చక్రపాణి ప్రసాద్ తెలిపారు. ఈ సమావేశానికి జడ్పిటిసి, ఎంపిటిసిలు, కోఆప్షన్, మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారులు హాజరు కావాలని అదేవిధంగా మండలంలోని అన్నిశాఖల అధికారులు తమ శాఖాపరమైన సమాచారం తీసుకుని పూర్తి వివరాలతో సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావాలని ఎంపీడీఓ తెలిపారు.

# జేఈఈ మెయిన్-2027 తేదీలు వచ్చేశాయి!

**-వచ్చే ఏడాది రెండు సెషన్లలో పరీక్షల నిర్వహణ**
**-జనవరి 22 నుంచి తొలి విడత పరీక్షలు**
**-ఏప్రిల్ లో సెకండ్ సెషన్ పరీక్షలు**
**-అక్టోబర్ 2026లో ప్రారంభం కానున్న రిజిస్ట్రేషన్లు**
**-యూజీసీ నెట్, క్యూయెట్ పీజీ తేదీలు కూడా ఖరారు**

దేశవ్యాప్తంగా ఉన్న ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశాల నిమిత్తం నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్ – 2027 షెడ్యూల్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) విడుదల చేసింది. విద్యార్థుల సౌలభ్యం కోసం పరీక్షల తేదీలను ముందస్తుగానే ప్రకటించింది. వచ్చే ఏడాది కూడా ఈ పరీక్షలను రెండు విడతల్లో నిర్వహించనున్నట్లు ఎన్‌టీఏ స్పష్టం చేసింది. జేఈఈ మెయిన్ – 2027 మొదటి విడత పరీక్షలు జనవరి 22, 23, 24, 28, 29, 30 తేదీల్లో జరగనున్నాయి. ఏప్రిల్ నెలలో నిర్వహించే రెండో విడత పరీక్షా తేదీలను ఎన్‌టీఏ ఇంకా ప్రకటించాల్సి ఉంది. ఈ పరీక్షలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ 2026 అక్టోబర్ నెలలో ప్రారంభమయ్యే అవకాశం ఉందని సమాచారం. జేఈఈ మెయిన్‌తో పాటు మరికొన్ని కీలక పరీక్షల తేదీలను కూడా ఎన్‌టీఏ వెల్లడించింది. దీని ప్రకారం, యూజీసీ నెట్ (ఖ+జ చీజు) పరీక్షను 2026 డిసెంబర్ 14 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించనున్నారు. అలాగే, కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ (CUET-PG) – 2027 పరీక్షలను మార్చి 1 నుంచి 5, 8, 12 నుంచి 20, 24, 25 తేదీల్లో జరపనున్నట్లు తెలిపింది. పరీక్షల తేదీలను ముందుగానే ప్రకటించడం వల్ల విద్యార్థులు తమ సన్నద్ధతను మరింత ప్రణాళికాబద్ధంగా కొనసాగించేందుకు వీలవుతుంది.

# విచారణకు హాజరుకావాల్సిందే.. పాక్ క్రికెటర్ రిజ్వాన్‌కు కోర్టు ఆదేశం

**పాక్ క్రికెటర్ మహమ్మద్ రిజ్వాన్ పిటిషన్‌ను కొట్టివేసిన లాహోర్ హైకోర్టు – సైబర్ క్రైమ్ ఏజెన్సీ ఇచ్చిన నోటీసులను సవాల్ చేసిన వికెట్ కీపర్**

**నోటీసులకు సమాధానం ఇవ్వాలని కోర్టు స్పష్టీకరణ – విచారణకు సహకరించాలన్న న్యాయస్థానం**

**రిజ్వాన్, ఇమామ్ ఉల్ హక్‌ల ఫోన్లపై కొనసాగుతున్న ఫోరెన్సిక్ పరీక్ష – ఏజెన్సీ నివేదిక ఆధారంగా ఆటగాళ్లపై చర్యలు తీసుకోనున్న పీసీబీ**



పాకిస్థాన్ సీనియర్ క్రికెటర్లు మహమ్మద్ రిజ్వాన్, ఇమామ్ ఉల్ హక్‌ల భవితవ్యంపై ఉత్కంఠ నెలకొంది. 'నేషనల్ సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ' (ఎన్‌సీసీఐఏ) జారీ చేసిన నోటీసులను సవాల్ చేస్తూ వికెట్ కీపర్ బ్యాటర్ రిజ్వాన్ దాఖలు చేసిన పిటిషన్‌ను లాహోర్ హైకోర్టు కొట్టివేసింది. దీంతో ఈ ఇద్దరు ఆటగాళ్లపై క్రమశిక్షణ చర్యలు తీసుకునే దిశగా పాకిస్థాన్ క్రికెట్ బోర్డ్ (పీసీబీ) అడుగులు వేసే అవకాశం కనిపిస్తోంది. నేడు ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన లాహోర్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలియా నీలమ్, ఇరుపక్షాల వాదనలు విన్న తర్వాత దానిని కొట్టివేస్తున్నట్లు ప్రకటించారు. విచారణ సందర్భంగా రిజ్వాన్ తరఫు న్యాయవాది ఖాజీ ఉమైర్ అలీ వాదనలు వినిపిస్తూ, తన క్లయింట్‌కు ఎన్‌సీసీఐఏ నోటీసులు జారీ చేసిందని తెలిపారు. దీనిపై స్పందించిన చీఫ్ జస్టిస్, "మీరు వెళ్లి నోటీసులకు సమాధానం ఇవ్వాలి. మీకు నోటీసు ఎప్పుడు జారీ అయింది?" అని ప్రశ్నించారు.

లార్డ్స్ టెస్ట్ తర్వాత తన క్లయింట్‌ను హోటల్ లాబీకి పిలిచి, ఎలాంటి నోటీసు లేకుండా విచారించారని, అతని మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారని న్యాయవాది కోర్టుకు వివరించారు. మూడు గంటల్లో ఫోన్ తిరిగి ఇస్తామని చెప్పి తీసుకున్నారని, కానీ ఇప్పటికీ ఇవ్వలేదని, ఇది దురుద్దేశాన్ని సూచిస్తోందని వాదించారు. క్రికెటర్లను అవినీతి నుంచి కాపాడేందుకు ఐసీసీ యాంటీ కరప్షన్ యూనిట్ సరైన వేదిక అని, ఈ కేసును ఆ విభాగానికి ఎందుకు అప్పగించలేదని ఆయన ప్రశ్నించారు. ఎన్‌సీసీఐఏ అధికార పరిధిని, దర్యాప్తు తీరును ఆయన సవాల్ చేశారు.ప్రస్తుత పరిణామాలను గమనిస్తున్న విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. ఎన్‌సీసీఐఏ అధికారులు రిజ్వాన్, ఇమామ్‌ల నుంచి స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్లకు ఫోరెన్సిక్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. వచ్చే వారంలోగా ఈ పరీక్షల నివేదికను పీసీబీకి సమర్పించనున్నారు. ఈ నివేదికలో వెల్లడయ్యే అంశాల ఆధారంగానే పీసీబీ తదుపరి చర్యలు తీసుకోనుంది. ఫోరెన్సిక్ పరీక్షలో అసాధారణంగా ఏమీ లభించకపోతే, ఆటగాళ్లకు ఉపశమనం లభించే అవకాశం ఉందని ఆ వర్గాలు తెలిపాయి. దీంతో ఇప్పుడు అందరి దృష్టి ఎన్‌సీసీఐఏ నివేదికపైనే కేంద్రీకృతమైంది.

# సినిమా న్యూస్

## ‘భరత్ నాట్యం’ మూవీ రివ్యూ!



మలయాళంలో సైజు కురుప్ కి మంచి ఇమేజ్ ఉంది. ఆయన ఎంచుకునే కథలు .. పాత్రలు అందుకు కారణమని చెప్పాలి. ఆయన కథానాయకుడిగా నటించిన సినిమానే ‘భరత్ నాట్యం’. 2024 లో ఆగస్టు 30వ తేదీన ఈ సినిమాను థియేటర్లలో విడుదల చేశారు. కామెడీ డ్రామా జోనర్లో రూపొందిన ఈ సినిమాకి థియేటర్ల వైపు నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. అలాంటి ఈ సినిమా ఈ నెల 10వ తేదీ నుంచి ‘ఆహా’లో అందుబాటులోకి వచ్చింది.

భరత్ నాయుడు ( మలయాళ సాయికుమార్) పదవీ విరమణ తరువాత ఇంటిపట్టునే ఉంటాడు. ఆయన భార్య ‘సరస్వతి’ ఆయనను అపురూపంగా చూసుకుంటూ ఉంటుంది. పెద్ద కొడుకు శశిధర్ ( సైజు కురుప్) పొలాలు .. తోటలు అందుకు సంబంధించిన వ్యవహారాలు చూసుకుంటూ ఉంటాడు. ఇక పై చదువులకు పట్నం వెళ్లాలనేది చిన్న కొడుకు అరుణ్ (జినిల్) ఆలోచన. పెద్ద కూతురు ‘శాంతి’ ఆమె భర్త ‘అశోకన్’ ఆ ఇంట్లోనే ఉంటూ ఉంటారు. ఈ నేపథ్యంలోనే ఆర్థికపరమైన ఇబ్బందుల కారణంగా, చిన్న కూతురు శ్రీలత .. ఆమె భర్త గోపాలన్ కూడా ఆ ఇంటికి చేరతారు. ఈ నేపథ్యంలోనే భరత్ నాయుడికి గుండెపోటు వస్తుంది. వెంటనే ఆయనను హాస్పిటల్లో చేరుస్తారు. ఆయన పరిస్థితి కష్టంగానే ఉందని డాక్టర్ చెబుతుంది. ఆ సమయంలోనే భరత్ నాయుడు తన పెద్ద కొడుకైన శశిధర్ ను పిలిచి, తనకి రెండో భార్య ఉందనీ .. ఆమెకి ‘అజయ్’ అనే కుమారుడు కూడా ఉన్నాడనే ఒక నిజాన్ని చెబుతాడు. వాళ్లిద్దరినీ చూడాలని ఉందనీ, శ్రీకంఠపురం వెళ్లి వాళ్లను తీసుకురమ్మని కోరతాడు. తండ్రి చివరి మాటను తల్లితో చెప్పి ఒప్పిస్తాడు శశిధర్. శ్రీకంఠపురం నుంచి రుక్మిణీ – అజయ్ లను తీసుకొస్తాడు. అయితే ఊహించని విధంగా భరత్ నాయుడు కోలుకుంటాడు. దాంతో రుక్మిణీ – అజయ్ లను ఊరికి పంపించేయాలని చూస్తాడు శశిధర్. కుదరకపోవడంతో తన ఇంట్లోనే పై గదిలో వాళ్లను రహస్యంగా ఉంచుతాడు. వాళ్లు ఊళ్లో ఎవరి కంట్లో పడకుండా మేనేజ్ చేస్తుంటాడు. ఆస్తిలో వాళ్లు వాటా అడుగుతారేమోనని శశిధర్ భయపడతాడు. సరస్వతితో పెళ్లి రిజిస్టర్ కాలేదనీ, రుక్మిణితో పెళ్లికి సంబంధించిన డాక్యుమెంట్స్ పక్కాగా ఉన్నాయనే విషయం ఆ సమయంలోనే అతనికి తెలుస్తుంది. అప్పుడు శశిధర్ ఏం చేస్తాడు? చివరికి ఆస్తి ఎవరికి దక్కుతుంది? అనేది కథ.

తండ్రి చావు బ్రతుకులలో ఉండగా, ఆయనకి రెండో ఫ్యామిలీ ఉందనే విషయం శశిధర్ కి తెలుస్తుంది. ఆయన చివరి కోరికను తీర్చడం కోసం, ఆ ఫ్యామిలీని తీసుకొస్తాడు. భరత్ నాయుడు మొదటి పెళ్లికి సంబంధించి ఎలాంటి ఆధారాలు ఉండవు. కానీ రెండో పెళ్లికి సంబంధించిన అన్ని ఆధారాలు పక్కాగా ఉంటాయి. దాంతో తనకి దక్కుతుందని భావించిన ఆస్తులకు రెక్కలు వచ్చాయని భయపడిన శశిధర్ ఏం చేస్తాడనేదే ఈ కథలోని ప్రధానమైన అంశం.

ఉమ్మడి కుటుంబంలోని సమస్యలు .. బరువు బాధ్యతలు .. తండ్రికి సీరియస్ కావడం .. అతనికి సెకండ్ ఫ్యామిలీ ఉందని తెలియడం .. వాళ్లను ఊరు నుంచి తీసుకురావడం వంటి సన్నివేశాలతో ఫస్టాఫ్ నడుస్తుంది. తండ్రికి సెకండ్ ఫ్యామిలీ ఉందనే నిజం బయటికి తెలియకుండా దాచడానికి చేసే ప్రయత్నాలు .. ఆస్తుల విషయంలో అభద్రతా భావం తాలూకు సన్నివేశాలు సెకండాఫ్ లో ప్రేక్షకుల ముందుకు వస్తాయి.

దర్శకుడు ఈ కథను మొదటి నుంచి చివరివరకూ చాలా పట్టుగా నడిపించాడు. సహజత్వంతో కూడిన సన్నివేశాలను, ఆసక్తికరంగా ఆవిష్కరిస్తూ వెళ్లాడు. కావాలని ఇరికించినట్టుగా కాకుండా, సున్నితమైన హాస్యాన్ని పండిస్తూ వెళ్లాడు. తన తండ్రికి సెకండ్ ఫ్యామిలీ ఉందనే విషయం ఊళ్లోవాళ్లకి తెలియకుండా దాచడం కోసం శశిధర్ పడే పాట్లు, అతని ఇంట్లో ఏం జరుగుతుందో తెలుసుకోవడానికి సన్నిహితులు చేసే ప్రయత్నాలు సరదాగా నవ్విస్తాయి.

ముఖ్యంగా భరత్ నాయుడు మొదటి భార్య రెండో కొడుకు అరుణ్ .. రెండో భార్య కొడుకు అజయ్ లను ట్విన్స్ గా డిజైన్ చేసిన తీరు గొప్పగా అనిపిస్తుంది. ఈ ఇద్దరూ ఒకే చోట కనిపిస్తే ఊళ్లో వాళ్లకు డౌట్ వస్తుందనే ఉద్దేశంతో నడిపించే ఒక కన్ఫ్యూజన్ డ్రామా కామెడీని బాగా వర్కౌట్ చేసింది. ఈ సినిమాను వినోదభరితంగా మరింత బలంగా మార్చడానికి ఈ ట్రాక్ బాగా ఉపయోగపడిందని చెప్పాలి.

దర్శకుడు ఈ కథలోని పాత్రలను మలిచిన తీరు .. వాటిని నడిపించిన విధానం ఆకట్టుకుంటుంది. ఆశలు .. అవసరాలు .. ఆపదలు .. ఆస్తులు అనేవి మనుషుల స్వభావాలను ఎలా మారుస్తాయి? అనే అంశాన్ని దర్శకుడు తెరమీదకి తీసుకొచ్చిన తీరు ఆలోచింపజేస్తుంది. ఆస్తుల కంటే బంధాలు .. అనుబంధాలు గొప్పవి. ఒక వ్యక్తిని ప్రేమించడమంటే ఆ వ్యక్తిలోని బలహీనతలను అర్థం చేసుకుని అంగీకరించడం అనే సందేశాన్ని ఇచ్చిన సినిమా ఇది.

కథాకథనాలు ఈ సినిమాకి ప్రధానమైన బలం అని చెప్పాలి. బబ్లూ ఫొటోగ్రఫీ .. శామ్యూల్ సంగీతం .. షఫీక్ ఎడిటింగ్ ఈ కంటెంట్ ను నెక్స్ట్ లెవెల్ కి తీసుకుని వెళ్లాయని చెప్పాలి. నటీనటులంతా తమ పాత్రలకు జీవం పోశారు. సందేశం .. వినోదం సమపాళ్లలో కలిసిన ఈ సినిమాను ఫ్యామిలీతో కలిసి సరదాగా చూడొచ్చు.

**సినిమా వివరాలు**

సినిమా పేరు: భరత నాట్యం
జానర్: కామెడీ, డ్రామా
విడుదల తేదీ: 2026-09-11
తారాగణం: సాయి కుమార్, సైజు కురుప్, అభిరామ్ రాధాకృష్ణన్, కళారంజిని, శ్రీజ రవి
దర్శకుడు: కృష్ణదాస్ మురళి
సంగీతం: శామ్యూల్ అబి
బ్యానర్: థామస్ తిరువల్ల ఫిల్మ్స్
సమీక్ష: పెద్దింటి
భరత నాట్యం రేటింగ్: 5కి 3.00

## చిరంజీవికి జోడీగా స్నేహ..? ‘కాకా’పై భారీ అంచనాలు



మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి కాంబినేషన్‌లో వస్తున్న భారీ యాక్షన్ డ్రామా చిత్రం ‘కాకా’పై చుట్టూ ఇండస్ట్రీలో తీవ్ర ఆసక్తి నెలకొంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ ఈ సినిమాపై అంచనాలను పెంచాయి. ఈ చిత్రంలో సీనియర్ నటి స్నేహ చిరంజీవికి జోడీగా భార్య పాత్రలో కనిపించనున్నారనే వార్త సినీ వర్గాల్లో హల్‌చల్ చేస్తోంది. అధికారిక ప్రకటన రాకపోయినప్పటికీ, ఈ కాంబినేషన్ నిజమైతే టాలీవుడ్ సీనియర్ టాప్ స్టార్లయిన నాగార్జున, వెంకటేశ్, బాలకృష్ణలతో పాటు చిరంజీవితోనూ నటించిన అరుదైన మైలురాయిని స్నేహ సొంతం చేసుకుంటారు. మరోవైపు, చిత్ర నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడ్యూసర్లతో చిరంజీవి ఉన్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ కాగా, త్వరలోనే ఫస్ట్ సింగిల్ విడుదలకు సన్నాహాలు చేస్తున్నారు. ఆక్వా పరిశ్రమలో పనిచేసే ‘కె. సత్యం’ అనే సాధారణ వ్యక్తి వెనుక ఉన్న భిన్నమైన యాక్షన్ కోణంతో సాగే కథలో నటి అనశ్వర రాజన్ ‘అమ్ములు పాప’గా ముఖ్య పాత్ర పోషిస్తోంది. శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని సంక్రాంతి కానుకగా విడుదల చేసేందుకు మేకర్స్ వేగంగా అడుగులు వేస్తున్నారు.



## ఓటీటీకి తమిళ రొమాంటిక్ మూవీ!




వెండితెరపై ‘శోభనం’ నేపథ్యంలోని కథలకు .. కంటెంట్ కి ఎంతో ప్రత్యేకత ఉంది. ఈ తరహా కథలకు కామెడీ తోడైతే, ఆ సినిమాలు ఏ స్థాయిలో విజయాల దిశగా దూసుకుపోతాయనే సంగతి తెలిసిందే. అలాంటి ఒక నేపథ్యం చుట్టూ అల్లుకున్న కథతో, చాలాకాలం తరువాత ప్రేక్షకుల ముందుకు ఒక సినిమా వచ్చింది. ఆ సినిమాపేరే ‘మొద రాత్రి’. రిషికాంత్ – అనిష్మా అనిల్ కుమార్ ప్రధానమైన పాత్రలను పోషించిన సినిమా ఇది. తమిళంలో చిన్న సినిమాలకు పెద్దవిజయాలను సాధించి పెట్టిన ఆర్టిస్టులలో రిషి కాంత్ – అనిష్మా అనిల్ కుమార్ పేర్లు తప్పకుండా కనిపిస్తాయి. వీరిద్దరూ జోడీగా దర్శకుడు రాజా కరుప్పస్వామి ‘మొద రాత్రి’ అనే సినిమాను రూపొందించాడు. భరత్ శంకర్ దర్శకత్వం వహించిన ఈ సినిమా, ఆగస్టు 21వ తేదీన థియేటర్లకు వచ్చింది. పాజిటివ్ టాక్ తెచ్చుకున్న ఈ సినిమా, రేపు ( సెప్టెంబర్ 18)న ‘నెట్ ఫ్లిక్స్’ ఫ్లాట్ ఫామ్ పైకి రానుంది. అందుకు సంబంధించిన అధికారిక ప్రకటన వచ్చేసింది. అప్పటివరకూ ఏ మాత్రం పరిచయం లేని ఒక యువకుడు – యువతి, పెద్దలు కుదిర్చిన పెళ్లి చేసుకుంటారు. సంప్రదాయం ప్రకారం ఆ జంటకు శోభనాన్ని ఏర్పాటు చేస్తారు. అయితే ఆ ఇద్దరి జీవితాలలోని రహస్యాలు ఎలా బయటపడతాయి? అప్పుడు వాళ్లు ఏం చేస్తారు? అనేది కథ. రొమాంటిక్ కామెడీ టచ్ తో నడిచే సినిమా,తమిళంతో పాటు తెలుగు .. మలయాళ .. కన్నడ .. హిందీ భాషల్లో అందుబాటులోకి వస్తోంది. ఓటీటీ వైపు నుంచి ఈసినిమా ఏ స్థాయిలో ఆకట్టుకుంటుందో చూడాలి మరి.

## అమెరికాలో నాని ‘ప్యారడైజ్’కు భారీ క్రేజ్.. అడ్వాన్స్ బుకింగ్స్‌తోనే లక్షల డాలర్లు




నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా నటిస్తున్న ‘ది ప్యారడైజ్’ చిత్రం విడుదల తేదీ సమీపిస్తున్న కొద్దీ అంచనాలను పెంచుతోంది. ముఖ్యంగా ఓవర్సీస్ మార్కెట్‌లో ఈ సినిమా సృష్టిస్తున్న సంచలనం ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరుస్తోంది. సెప్టెంబర్ 24న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానున్న ఈ చిత్రం, ఒక రోజు ముందుగానే ప్రీమియర్ షోలతో సందడి చేయనుంది. నార్త్ అమెరికాలో ఇప్పటికే ప్రారంభమైన అడ్వాన్స్ బుకింగ్స్‌లో ‘ప్యారడైజ్’ సరికొత్త రికార్డులు నమోదు చేస్తోంది. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందుతున్న ఈ యాక్షన్ థ్రిల్లర్‌పై మొదటి నుంచీ భారీ అంచనాలు ఉన్నాయి. దీనికి తగ్గట్టే ఉత్తర అమెరికాలో అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభమైన కొద్ది గంటల్లోనే లక్ష డాలర్ల మార్కును దాటి, అత్యంత వేగంగా ఈ ఘనత సాధించిన తెలుగు చిత్రంగా రికార్డు సృష్టించింది. మధ్యలో బుకింగ్స్ కాస్త నెమ్మదించినా, విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో మళ్లీ ఊపందుకున్నాయి. తాజాగా ఓవర్సీస్ డిస్ట్రిబ్యూటర్లు వెల్లడించిన వివరాల ప్రకారం, నార్త్ అమెరికాలో ప్రీమియర్ల కోసం ఇప్పటివరకు 15,000కు పైగా టిక్కెట్లు అమ్ముడయ్యాయి. దీని ద్వారా ప్రీ-సేల్స్ రూపంలోనే 350ఖ (సుమారు రూ. 3.35 కోట్లు) డాలర్ల వసూళ్లు దాటినట్లు సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. నాని సినిమాలకు మొదటి నుంచి యూఎస్‌లో మంచి మార్కెట్ ఉండటంతో, ‘ప్యారడైజ్’ కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

Printed by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Published by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Owned by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Printed at:SINDHURA DARSINI PUBLICATION, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Editor: KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Email:SINDHURADARSINI.2023@Gmail.com, Cell:7569677170,RNI/APTEL/2023/87662